



గోనుపల్లిలో అత్తవారింట పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్లు



స్వామివారికి ఇష్ట నైవేద్యాన్ని సమర్పిస్తున్న గిరిజనులు





గోనుపల్లి నుంచి కోనకు పల్లకీలో బయలు దేరిన స్వామి, దేవేరులు

పెంచలోరికి జై

శ్రీవారి బ్రహ్మోత్సవాల ప్రారంభం

- గోనుపల్లి నుంచి ఊరేగింపుగా కోనకు ఉత్సవమూర్తుల రాక
- గిరిజనవాడల్లో అంబరాన్ని అంటిన సంబరాలు
- వైభవంగా అంకురార్పణ పూజలు
- ఘనంగా సేనాధిపతి ఉత్సవం

రాపూరు(డక్కిలి), మే 19 : రాపూరు మండలం గోనుపల్లి, గోనుపల్లి గిరిజనవాడలు ఆదివారం ఉదయం గోవింద నామస్మరణతో మారుమోగాయి. తప్పెట్లు, తాళాలు, గిరిజన నృత్యాలు, బాజాభజంత్రీల మధ్య ఉభయ దేవేరులతో కలిసి పెంచలస్వామి బ్రహ్మోత్సవాలు జరుపుకునేందుకు గోనుపల్లిలోని అత్తారింటి నుంచి పెంచలకోనకు పయనమయ్యారు. తొలుత గ్రామంలోని పెంచలోరి ఆలయం నుంచి పల్లకీలో చెంచు లక్ష్మి అమ్మవారి ఇంటికి చేరుకున్నారు. కొత్త అల్లుడి రాకతో గోనుపల్లి గిరిజనవాడలో ఘనంగా సంబరాలు జరుపుకొన్నారు. ఇంటికి వచ్చిన అల్లుడికి గిరిజనులు తమ ఆచారం ప్రకారం పుట్టతేనె, ఇంజేటి గడ్డలు, నార మొలతాడును సారెగా ఇచ్చారు. గిరిజనవాడలోని ప్రతి ఇంటి వద్ద నేరేడు ఆకులతో పందెళ్ల వేసి, ఇంటి ముంగిట రంగవళ్లులు తీర్చిదిద్ది వధూవరులకు ఘనంగా స్వాగతం పలికారు. అత్తారింటికి చేరుకొన్న వరుడిని చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొన్నారు.అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం ముత్తైదువులు గ్రామ పొలిమేర వరకు సాగనంపారు. ప్రత్యేక పూల అలంకరణ చేసిన పల్లకీలో దేవేరులతో కలిసి స్వామివారు గ్రామ శివారులోని గొల్లబోయి ఆలయానికి చేరుకుని గొల్లబోయికి తొలిదర్శనం ఇచ్చారు. అనంతరం బోయలు పల్లకీ మోసుకుంటూ కాలినడకన కోనకు చేరుకొన్నారు. ఉదయం 9 గంటలకు గోనుపల్లిలో బయలుదేరిన స్వామివారు మధ్యాహ్నం 12 గంటలకు కోనకు చేరకున్నారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సాగర్ బాబు, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. కాగా బ్రహ్మోత్సవాలు జరిగే ఐదురోజులు కూడా గోనుపల్లి వాసులు నియమ,నిష్టలతో మాంసాహారాలకు దూరంగా ఉంటారు. కాగా కోనకు చేరుకున్న స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, విశేష పూజలు నిర్వహించారు.

వైభవంగా అంకురార్పణ

కోనలోని శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అంకురార్పణ పూజలతో మొదలయ్యాయి. ఆలయంలోని అలంకార మండపంలో అర్చకులు, వేదపండితులు ప్రత్యేక యాగశాల ఏర్పాటుచేసి నిత్య హోమాలను ప్రారంభించారు. అర్చకులు పుట్ట మన్నును తీసుకువచ్చి, అందులో నవధాన్యాలు కలిపి కలశస్థాపన చేసి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. ఎలాంటి ఆటంకాలు జరగకుండా విజయవంతంగా ఉత్సవాలు జరిగేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కోన వీధుల్లో సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు

సింహ వాహనంపై లక్ష్మీనరసింహుడు

వేదగిరిపై బ్రహ్మోత్సవ శోభ

నెల్లూరు రూరల్, మే 19: వేదగిరిపై లక్ష్మీ నరసింహుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ చేసి మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మండపానికి తోడ్కొని వచ్చారు. అక్కడ అర్చక బృందం శోభాయమానంగా స్వామివారిని అలంకరించి అనంతరం సింహవాహనంపై ఆశీనులను చేశారు. తదుపరి ఆలయ వీధులతోపాటు గిరిప్రదక్షిణ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకలను భక్తులు కనులార వీక్షించి పులకించిపోయారు. కాగా ఆలయ గోశాలకు దాతలు బహూకరించిన 8 గరుకు స్తంభాలను గోశాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో గిరికృష్ణ, ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



ఓట్లా.. వాపసా!

- ఓటుకు నోటిచ్చిన వైసీపీ నేతల డిమాండ్
- తిరిగి తీసుకుంటున్న వైనం
- ఎమ్మెల్యే అనుచరుల తీరుపై వృద్ధుల ఆగ్రహం

గత సార్వత్రిక ఎన్నికల్లో రెండుసార్లు గెలిచి, ఈ దఫా మూడోసారి పోటీచేసిన కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గానికి చేసింది ఏమి లేకపోవటంతో ఓటమి భయం పట్టుకుంది. దీంతో నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో సైతం కలియతిరిగి పాఠశాలలు, ఆలయాలు, దర్గాలు, చర్చిల నిర్మాణాలకు తాయిలాలు అందజేశారు. ఎమ్మెల్యేపై వ్యతిరేకత ఎక్కువగా ఉన్న తీరప్రాంత గ్రామాలకు అర్ధరాత్రి తమ అనుచరులను పంపి నయానో .. భయానో లొంగదీసుకునే ప్రయత్నం చేశారు. ఇందుకు పలుచోట్ల ఓటర్లకు రూ.2000 వంతున నగదు కూడా పంపిణీ చేశారు.

కావలి రూరల్, మే 19 : కావలి మండలం చెంచుగానిపాలెం జడ్పీటీసీ సభ్యుడు జంపాని రాఘవులు స్వగ్రామం. దీంతో ఆయన సార్వత్రిక ఎన్నికల్లో తన సత్తా చాటాలని నిర్ణయించుకున్నాడు. పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళ్లినవారిని సైతం ఓట్లు వేసేందుకు గ్రామానికి రప్పించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కు ఓటు వేయాలని గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేయడమేకాక వృద్ధులకు ఓటుకు నోటు పంపిణీ చేయించారు. ఎమ్మెల్యేపై, ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో ఎన్నికల్లో అనుకున్న స్థాయిలో వైసీపీకి ఓట్లు పడలేదు. పైగా టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి గెలుపు ఖాయమన్న సంకేతాలు వెలువడ్డాయి. విషయం గమనించిన జడ్పీటీసీ సభ్యుడు పోలింగ్ అనంతరం ఓటర్ల వద్దకు వెళ్లి 'మీరు ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ఓటేసి ఉంటే ప్రమాణం చేయండి. లేకుంటే మా వద్ద తీసుకున్న నగదు తిరిగి ఇవ్వాలని పేద వృద్ధులను, అనారోగ్యంతో ఉన్న వారిని సైతం వేధించారు. ఆయనిచ్చిన నగదును వాపసు తీసుకున్నారు. ఇలా చేయడంపై గ్రామంలో విమర్శలు వెల్లువెత్తాయి. సదరు జడ్పీటీసీ జేబులో నుంచి ఏమైనా నగదు తీసి మాకిచ్చాడా...? మేము ఓటు వేసింది.. లేనిది ఆయనకు ఎలా తెలుస్తుంది...? ఆయనకు నగదు ఎందుకు తిరిగి ఇవ్వాలని ఒకరిద్దరు అన్నా... ఒత్తిళ్లకు లొంగి ఇవ్వక తప్పలేదు.

> 'మీరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి కచ్చితంగా ఓటేసి ఉంటే ప్రమాణం చేయండి. లేదంటే మేమిచ్చిన రూ.2,000 తిరిగి మాకు ఇచ్చేయండి'
> - కావలి రూరల్ మండలంలో వైసీపీ నేతల బెదిరింపుల పర్వం

బలవంతంగా లాగేసుకున్నారు..

మీరు మాకు ఓటు వేయలేదంటూ.. అనారోగ్యంతో బాధపడుతున్న చెంచుగానిపాలెంకు చెందిన పోసిన రమణమ్మ, వృద్ధురాలు అయిన దద్దాల శాంతమ్మ ఇళ్లకు వెళ్లి వారిచ్చిన నగదును తిరిగి లాగేసుకున్నారు. అలాగే గ్రామానికి చెందిన ఉప్పాల వెంకటేశ్వర్లు, ఆయన భార్య కామేశ్వరి ఖమ్మంలో జ్యూస్ షాపు నిర్వహిస్తూ ఓటు వేసేందుకు స్వగ్రామానికి వచ్చారు. అప్పటికే గ్రామంలో ఉన్న వెంకటేశ్వర్లు తల్లిదండ్రులు లక్ష్మమ్మ, పోలయ్య వద్దకు వెళ్లి మీ ఇంట్లో నలుగురూ వైసీపీకి ఓట్లు వేయాలని రాఘవులు నాలుగు ఓట్లకు నగదు అందజేశాడు. పోలింగ్ అనంతరం ఓటు వేసినట్లు ప్రమాణం చేయమనడంతో వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా వినకుండా ఇచ్చిన నగదును జడ్పీటీసీ లాగేసుకున్నాడు. అలాగే ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చి తిరిగి వెళ్లిపోయిన దద్దాల నాగార్జున అనే పేరుగల ఇద్దరికి ఫోన్లు చేసి, మీరు మాకు ఓటేసినట్లు గ్యారెంటీ ఏంటి...? నగదు తిరిగి ఇవ్వాలని దూషించాడు. దీంతో గ్రామంలోని వారివారి కుటుంబ సభ్యులు నగదును తిరిగి ఇచ్చేశారు. కాగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ముందుగా గ్రామాల్లో ఓటుకు నగదు పంపిణీ చేయించి, పోలింగ్ అనంతరం ఓటమి భయంతో ఇచ్చిన నగదును తన అనుచరులతో తిరిగి వసూలు చేయిస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





దద్దాల శాంతమ్మ | పోసిన రమణమ్మ | మంచానికే పరిమితమైన ఉప్పాల పోలయ్య

ఈసీ ఆదేశాల మేరకే విధులు

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే జిల్లాలో ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలను ఏర్పాటు చేసి విధులు కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌ను పూర్తి స్థాయిలో నియమించామని, అలానే ఎస్ఎస్‌టీలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజలు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

సై అంటే సై..!

- కందుకూరులో జోరుగా పందేలు
- బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇరుపక్షాలు
- ఉసిగొల్పుతున్న మధ్యవర్తులు

కందుకూరు, మే 19: ఎన్నికల ఫలితాల పై కందుకూరులో బెట్టింగ్‌లు జోరందుకుంటున్నాయి. ఎన్నికలు ముగిశాక మూడు,నాలుగు రోజులు లెక్కల్లో మునిగిన నేతలు గత రెండు రోజులుగా పందేలకు సై అంటున్నారు. నియోజకవర్గంలో పోటాపోటీగా ఎన్నిక జరిగిందన్న అంచనాతో జయాపజయాలపై పందేలు వేసేందుకు ఇరుపార్టీల కార్యకర్తలు, అభిమానులు ఆచితూచి అడుగు వేస్తున్నారు. అయితే జిల్లాలో ఫలానా పార్టీకి ఇన్ని సీట్లకు మించి రావు, రాష్ట్రంలో ఫలానా పార్టీ అధికారంలోకి రాదు.. అన్న అంశాలపై పందేలు వేయటంతోపాటు రాష్ట్రంలో ప్రముఖులు పోటీచేసిన నియోజకవర్గాల్లో జయాపజయాలు, వారికి వచ్చే మెజారిటీపై కూడా పెద్దఎత్తున పందేలు కాస్తున్నారు. కందుకూరులో ఇరుపార్టీలలోనూ వెన్నుపోటు రాజకీయాలు నడిచాయన్న చర్చ విస్తృతంగా జరుగుతోంది. అటు వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ పరాజయం చెందాలన్న లక్ష్యంతో ఓవర్గం నాయకులు పనిచేశారని, ఎన్నికల అనంతర పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. అదేసమయంలో టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు వ్యతిరేకంగా కూడా కొంతమేరకు టీడీపీ వర్గీయులు పనిచేశారన్నది స్పష్టమవుతోంది. ఈ పరిణామాలతో ఏ వర్గానికి ఎంత నష్టం జరిగింది, ఫలితం ఎలా ఉండబోతుంది...? అన్న అంశాలపై లోతైన విశ్లేషణలు చేస్తూ పందేలు కడుతున్నారు.

మధ్యవర్తుల వద్ద నగదు

పందేలు కాసినవారు డబ్బును మధ్యవర్తుల వద్ద ఉంచారు. సేకరించిన సమాచారం మేరకు కందుకూరులో ఇప్పటివరకు వివిధరూపాల్లో కాచిన పందేలలో రూ.2 కోట్ల వరకు డబ్బు మధ్యవర్తుల వద్దకు చేరినట్లు సమాచారం. అందులో 10 శాతం మాత్రమే కందుకూరులో అభ్యర్థుల గెలుపోటములపై పందేలు కాసినట్లు సమాచారం. ఎన్నికల తర్వాత సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం, ఇతరత్రా రాజకీయ నాయకులు చేస్తున్న ప్రకటనలతో వైసీపీ క్యాడర్ తిరిగి జగనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాడన్న అంశంపై పందేలు కాసేందుకు సైఅంటున్నారు. ...ట్టిపరిస్థితుల్లో రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటుచేసి తీరుతాడన్న సంపూర్ణ ...్వాసంతో ఉన్న టీడీపీ క్యాడర్ ఈ పందేనికి లక్షకు లక్షన్నర నుంచి రెండులక్షలు కూడా ...ందుకు సిద్ధపడుతుండటంతో పెద్దఎత్తున పందేలు జరుగుతున్నాయి. అంతేకాదు ...లో ప్రధాన నాయకులు, పార్టీల అధినేతలు పోటీ చేసిన నియోజకవర్గాలైన కుప్పంలో ...బాబునాయుడు, పిఠాపురంలో పవన్ కల్యాణ్, హిందూపురంలో బాలకృష్ణ, మంగళగిరి ...ష్, పులివెందులలో జగన్ మెజారిటీలపై కూడా జోరుగా పందేలు జరుగుతున్నాయి. ...కరు పోటీకి, అధిక మొత్తంలో వచ్చే నగదు ఆశపడి పలువురు ఈ బెట్టింగులలో ...న్నారు.

మధ్యవర్తుల ప్రోత్సాహం

కాగా కందుకూరులో బెట్టింగ్‌రాయుళ్లను ఉసిగొల్పి పందేలు కట్టించటంతో కొందరు మధ్యవర్తులు క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. ఇరుపక్షాలకు మాట్లాడి పందెం సెట్ చేయటంతోపాటు ఆ డబ్బుకు బాధ్యత వహించాల్సింది కూడా మధ్యవర్తే కావటంతో వీరికి 5 శాతం కమీషన్ ముట్టజెబుతారు. అంటే కోటి రూపాయలు పందెం సెట్ చేయగలిగితే రూ. 5 లక్షలు ఆదాయం వచ్చే పరిస్థితి కావటంతో మధ్యవర్తులు అదేపనిగా ఇరుపక్షాలను రెచ్చగొట్టి మరీ పందేలు కాయిస్తున్నారు. కందుకూరులోనే కనీసం 20 మంది మధ్యవర్తులు బిజీగా ఉండటంతో జోరుగా పందేలు సాగుతున్నాయి. రానున్న వారం పదిరోజుల్లో ఈ పందేల జోరు మరింత ఊపందుకునే అవకాశం ఉంది. రాజకీయ నాయకులు కూడా బెట్టింగ్ రాయుళ్లను ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. గతంలో ఎన్నికల సమయంలో అనేక కుటుంబాలు ఈ బెట్టింగ్‌ల కారణంగా ఆర్థికంగా చితికిపోయిన ఉదంతాలు కళ్ల ముందే కనిపిస్తున్నా బెట్టింగ్‌రాయుళ్ల మాత్రం వెనక్కు తగ్గడం లేదు.



వేసవిలో దొంగల హల్‌చల్‌!

● అప్రమత్తంగా లేకుంటే దోచేస్తారు..

● లాక్డ్‌ హౌస్‌ మానటరింగ్‌ సిస్టమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నెల్లూరు(క్రైం), మే 19: వేసవి కాలం వచ్చిందంటే దొంగలకు సీజన్‌ ప్రారంభమైనట్లే. అయితే ఈ ఏడాది ఎన్నికల హడావడి ఉండటంతో ఓటు హక్కు వేసేందుకు ఇప్పటి వరకు ఇళ్లకే పరిమితమైన ప్రజలు ఇప్పుడిప్పుడే సొంతూర్లు, షికార్లు, బంధువుల వద్దకు వెళుతున్నారు. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా లేకుంటే దొంగలు దొరికేందే అవకాశంగా ఇళ్లను దోచుకెళ్లిపోతారు. రాత్రి పూట ఆరుబయట, మిద్దెలపై నిద్రించేవారు, ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళుతున్నప్పుడు ప్రజలు అప్రమత్తంగా లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

దొంగతనాలపై అవగాహన కరువు

వేసవి కాలంలో జరిగే దొంగతనాలపై ప్రతి ఏటా ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో కర పత్రాలు, సమావేశాల ద్వారా పోలీసులు అవగాహన కల్పించేవారు. ఈ ఏడాది పోలీసులు ఎన్నికల హడావడిలో అవగాహన కల్పించడంపై దృష్టి సారించలేదు.



ఈ జాగ్రత్తలు పాటించాలి

● వేసవిలో మహిళలు బంగారు నగలు ధరించి ఇంటి ఆరుబయట, మిద్దెపైన నిద్రించకూడదు.

● ఇంటి లోపల డోర్స్‌ లాక్‌ చేసుకోవడం, గడియ పెట్టుకోవడం మరిచిపోకూడదు.

● కుటుంబ సభ్యులందరూ ఊరు వెళ్లవలసి వస్తే బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు బ్యాంకు లాకరులో భద్రపరచుకోవడం, లేకుంటే వెంట తీసుకువెళ్లడం మంచిది.

LHMS AP Police

● ఇంటికి తాళం వేసి ఇతర ఊర్లకు వెళ్లేటప్పుడు ముందుగా పోలీసులను సంప్రదిస్తే వారు పోలీసు శాఖ ప్రవేశపెట్టిన లాక్డ్‌ హౌస్‌ మానటరింగ్‌ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి దొంగతనం జరగకుండా పర్యవేక్షిస్తారు.

● అనుమానాస్పద వ్యక్తుల పట్ల 100 నెంబరుకు సమాచారం అందించాలి. ఇలా పలు అంశాలను ప్రజలకు తెలియజేసేలా పోలీసు శాఖ ప్రచారం కల్పించాల్సి ఉంది.

లాక్డ్‌ హౌస్‌ మానటరింగ్‌ సిస్టం..

ఇళ్లకు తాళాలు వేసుకొని సొంతూర్లకు వెళ్లే ప్రజలు పోలీసులను సంప్రదిస్తే లాక్డ్‌ హౌస్‌ మానటరింగ్‌ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్‌) సేవలు అందిస్తారు. స్మార్ట్‌ ఫోన్‌లోని గూగుల్‌ ప్లే స్టోర్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్‌ యాప్‌ డౌన్‌లోడ్‌ చేయించి ఆ యాప్‌లో లాగిన్‌ అయిన వెంటనే ఎల్‌హెచ్‌ఎంఎస్‌లో నమోదు పూర్తి చేయిస్తారు. ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లే ప్రజలు ముందుగా ఎల్‌హెచ్‌ఎంఎస్‌ యాప్‌లోకి వెళ్లి రిక్వెస్టు పోలీసు వాచ్‌ను ఎంపిక చేసుకుని ఏ తేదీన ఏ సమయానికి ఊరు వెళుతున్నారు, తిరిగి ఎప్పుడు వస్తారు అన్న వివరాలు యాప్‌లో పొందుపరచాలి. ఆ సమాచారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్‌ కంట్రోల్‌ రూమ్‌కు చేరుతుంది. అప్పుడు సిబ్బంది ఆ ఇంట్లో వైఫైతో పనిచేసే నిఘా కెమెరాలను అమర్చుతారు. ఆ ఇంట్లో ఎలాంటి కదలికలు ఉన్నా కమాండ్‌ కంట్రోల్‌ రూమ్‌లో సైరన్‌ మోగడంతో పాటు సంబంధిత పోలీస్‌ స్టేషన్‌, రక్షక్‌, బ్లూకోల్ట్స్‌ వాహనాలకు సమాచారం వెళ్తుంది. దీంతో పోలీసులు వెంటనే దొంగలు చొరబడ్డ ఇంటికి చేరుకొని వారిని పట్టుకునేందుకు అవకాశం ఉంటోంది.

అసాంఘిక శక్తుల ఏరివేతకే కార్డన్‌ సెర్చ్‌

● జిల్లా ఎస్పీ ఆరీఫ్‌ హఫీజ్‌



కార్డన్‌ సెర్చ్‌ నిర్వహిస్తున్న డీఎస్పీ, సీఐ, సిబ్బంది

నెల్లూరు(క్రైం), మే 19: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అణచివేత, దొంగతనాల నివారణ, అసాంఘిక శక్తుల ఏరివేతే కార్డన్‌ సర్చ్‌ ముఖ్య ఉద్దేశమని జిల్లా ఎస్పీ కే ఆరీఫ్‌ హఫీజ్‌ తెలిపారు. ఆదివారం జిల్లాలోని నవాబుపేట, కావలి వన్‌ టౌన్‌, కావలి టూ టౌన్‌, కావలి రూరల్‌, ఉదయగిరి, వింజమూరు పరిధిలో పోలీసులు కార్డన్‌ సర్చ్‌ నిర్వహించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, స్పెషల్‌ పార్టీలతో కలిసి ఆయా ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్డన్‌ సర్చ్‌లలో సరైన పత్రాలు లేని 64 బైక్‌లు, రెండు ఆటోలు, 89 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సామాన్య ప్రజల్లో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచడానికి ఈ కార్డన్‌ సర్చ్‌ ఆపరేషన్‌లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. పరారీలో ఉన్న నేరస్థులను గుర్తించి అదుపులోకి తీసుకోవడం, అనుమానంగా ఉన్న రికార్డులు లేని అన్ని వస్తువులు, వాహనాలు, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు గుర్తించి స్వాధీన పరుచుకోవడమే లక్ష్యం అన్నారు. ప్రత్యేక కార్యాచరణ ద్వారా జిల్లాలో హింసాత్మక చర్యలు అరికట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ఆనకట్టలో పసికందు మృతదేహం

ఉదయగిరి రూరల్‌, మే 19: పట్టణంలోని ఆనకట్టలో పసికందు మృతదేహం గుడ్డలో చుట్టి పడవేసి ఉండడాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. సమీపంలో ప్రైవేట్‌ వైద్యశాలలు ఉండడంతో కాన్పుకు వచ్చి ఆడశిశువు మృతి చెందడంతో ఆనకట్టలో పడవేసి ఉంటారని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ గిరిబాబు, ఎస్‌ఐ ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టు మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి విచారణ చేపట్టామన్నారు. ఈ విచారణ లో ఆర్లపడియ ఎస్టీ కాలనీకి చెందిన ఓ మహిళ కాన్పు కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్‌ వైద్యశాలకు వచ్చిందన్నారు. కాన్పు సమయంలో పుట్టిన బిడ్డ మృతి చెందడంతో వారు ఇంటికి వెళ్లారన్నారు. వైద్యశాల వారు అక్కడి సిబ్బందికి పసికందు మృత దేహాన్ని పూడ్చి పెట్టాలని సూచించడంతో వారు పడవేసి వచ్చినట్లు తేలిందన్నారు.



పసికందు మృతదేహం

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

నెల్లూరు(క్రైం), మే 19: తండ్రితో కలిసి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా జరిగిన ప్రమాదంలో వివాహిత మృతి చెందింది. నార్త్‌ ట్రాఫిక్‌ పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని వెలగచెట్టు సంఘంకు చెందిన సురేష్‌, లక్ష్మి(21)లు దంపతులు. వారికి ఐదు, ఏడు సంవత్సరాల ఇద్దరు పిల్లలున్నారు. సురేష్‌ పెయింటింగ్‌ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. లక్ష్మి ఆదివారం తన తండ్రి సుబ్రహ్మణ్యంతో కలసి స్కూటీలో కోవూరులోని బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడ పనులు ముగించుకుని అదే రోజు రాత్రి తిరిగి ఇంటికి బయలుదేరారు. ఎస్‌వీజీఎస్‌ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై వస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ బైక్‌ స్కూటీని ఢీకొంది. ఈ ఘటనలో లక్ష్మి రోడ్డుపై పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా ఆమె తండ్రికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నార్త్‌ ట్రాఫిక్‌ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్‌ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌

	కిలో
బాయిలర్‌ లైవ్‌	172
లేయర్‌ లైవ్‌	110
స్కిన్‌ చికెన్‌	300
స్కిన్‌లెస్‌	330
లేయర్‌	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 7052
వెండి కిలో ధర	రూ. 93,200
వెండి ఒక గ్రాము	రూ. 95.20

రెండు బైక్‌ల ఢీ

● ఇద్దరికి గాయాలు

విడవలూరు, మే 19 : మండల పరిధిలోని వీరారెడ్డిపాలెం గ్రామ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. స్థానికులు, బాధితుల కథనం మేరకు... వీరారెడ్డిపాలెంకు చెందిన ఆళ్లపాక శ్రీహరి, ఆళ్లపాక మల్లికార్జున్‌, సురేష్‌లు పొలం పనులు చేసుకుని స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా అలగానిపాడుకు చెందిన సమాధి లోకేష్‌ బైక్‌ రెండూ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఆళ్లపాక శ్రీహరి, సమాధి లోకేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో స్థానికులు నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

ధీమా ఇవ్వని బీమా!


అపరిష్కృతంగా క్లైయిమ్‌లు ●

జిల్లాలో 1200 పెండింగ్‌ ●

పరిహారం చెల్లింపుల్లో జాప్యం ●

బాధిత కుటుంబాల నిరీక్షణ ●

ఏదైనా ప్రమాదంలో ఇంటి యజమానిని కోల్పోయినప్పుడు, ఆ కుటుంబం దిక్కులేనిది అవుతుంది. ఆ కుటుంబ సభ్యులు అనాథలుగా మిగలకుండా బీమా పథకం ఆసరాగా నిలుస్తోంది. ఈ క్రమంలో పేదలు కానీ, ఉద్యోగులు కానీ జీవిత బీమాను కచ్చితంగా చేస్తుంటారు. పేదలు ఇబ్బందులు పడకుండా గత టీడీపీ ప్రభుత్వం చంద్రన్న బీమాను ప్రవేశపెట్టింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక జగన్‌ ప్రభుత్వం కూడా వైఎస్‌ఆర్‌ బీమాను అమలు చేస్తున్నది. అయితే జిల్లాలో వైఎస్‌ఆర్‌ బీమా పథకం పరిహారం చెల్లింపులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పథకాన్ని 2020 అక్టోబరు 1న వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీమా నమోదు 2022 మే నుంచి జూన్‌ 30వరకు జరిగింది. బీమా చేసుకొన్న వారు ఏ ఏడాది కాయేడాది రెన్యువల్‌ కూడా చేసుకున్నారు. కానీ పరిహారం మాత్రం అందడం లేదు.



నెల్లూరు(హరనాథపురం) మే 19 : వైఎస్‌ఆర్‌ బీమా పథకంలో జిల్లాలో సుమారు ఆరు లక్షల మంది నమోదై ఉన్నారు. వీరికి బీమా మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించింది. ఈ పథకంలో చేరి 18 నుంచి 50 ఏళ్ల లోపు మరణం సంభవించినా, 70 ఏళ్ల లోపు ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి అంగవైకల్యం పొందినా బీమా పరిహారం చెల్లిస్తారు. సహజ మరణానికి రూ.లక్ష, ప్రమాద మరణానికి రూ. 5 లక్షలు చెల్లిస్తారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2016 అక్టోబరు 2న చంద్రన్న బీమా పథకాన్ని ప్రారంభించారు. 18 నుంచి 70ఏళ్ల లోపు వయసున్న నిరుపేదలందరికీ ఈ పథకాన్ని వర్తింపచేశారు. ఏడాదికి కేవలం రూ.15 ప్రీమియం చెల్లిస్తే చాలు. 18 నుంచి 50 ఏళ్లలోపు వారు సహజ మరణం చెందితే బాధిత కుటుంబా నికి రూ.2లక్షలు, 51 నుంచి 60 ఏళ్ల మధ్య వారు చనిపోతే రూ.30 వేలు, 18-70 ఏళ్ల వారు మృతిచెందినా, శాశ్వత అంగవైకల్యం ఏర్పడినా రూ.3లక్షలు, పాక్షిక అంగవైకల్యం ఏర్పడితే రూ.2.5లక్షల వంతున పరిహారం అందేది. మృతి చెందిన లేదా ప్రమాదం జరిగిన రోజు నుంచి రెండు వారాల్లో బాధిత కుటుంబాలకు చెక్కు రూపంలో పరిహారం అందేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక చంద్రన్న బీమా పథకాన్ని వైఎస్‌ఆర్‌ బీమాగా పేరు మార్చారు. అంతేకాక పరిహారం చెల్లింపులో నిబంధనలు కూడా మార్చేశారు. కేవలం తెల్ల రేషన్‌కార్డుదారులను మాత్రమే ఈ పథకానికి అర్హులుగా చేసింది.

● బాధితులకు అందని పరిహారం

జిల్లాలో వైఎస్‌ఆర్‌ బీమా చేసి, మరణించినవారికి సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు ప్రభుత్వానికి, ఎల్‌ఐసీకి పంపారు. సహజమరణానికి సంబంధించి బీమా పరిహారాన్ని ప్రభుత్వం నేరుగా చెల్లిస్తుంది. జిల్లాలో 2022 జులై 1 నుంచి 2023 జూన్‌ 30 వరకు 1,617 క్లైయిమ్‌లకు రూ.20.81 కోట్ల చెల్లింపులు జరిగాయి. 2023 జులై 1 నుంచి 2024 ఏప్రిల్‌ 27 వరకు 1,159 క్లైయిమ్‌లకు సంబంధించి రూ.15.91 కోట్ల చెల్లింపులు జరిగాయి. అయితే ఇంకా 1,200 మంది క్లైయిమ్స్‌లను పరిష్కరించలేదని సమాచారం. ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి బీమా యాప్‌లను ప్రభుత్వం మూసేసింది. పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని బాధిత కుటుంబాలు కోరుతున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ఇద్దరు దుర్మరణం ● పదిమందికి తీవ్ర గాయాలు ● మృతులు ప్రకాశం జిల్లా వాసులు

కోవూరు, మే 19: ముంబై జాతీయరహదారిపై కోవూరు మండల పరిధిలోని గంగవరం రోడ్డు సమీపంలో ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనగా ఇద్దరు మృతి చెందారు. పదిమందికి తీవ్రగాయాలయ్యాయి.ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి నెల్లూరుకు శనివారం రాత్రి ఆర్టీసీ బస్సు బయలుదేరింది. బస్సు బుచ్చి మండలం దామరమడుగు దాటి కోవూరు పోలీసుస్టేషన్‌ పరిధిలోని గంగవరం రోడ్డు సమీపంలోని పెట్రోలు బంకు వద్దకు రాగానే ఆగి ఉన్న లారీని ఢీకొంది.ఈ ప్రమాదంలో ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన వేమవరపు మరియమ్మ(42సం), కంకణంపాడు గ్రామానికి చెందిన డేవిడ్‌(44) అక్కడికక్కడే మృతి చెందారు. మరో పదిమందికి తీవ్రగాయాలు అయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలలకు తరలించారు. ప్రమాదం సంభవించిన సమయంలో ఆర్టీసీ బస్సులో 47మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన సమయంలో వారంతా గాఢనిద్రలో ఉన్నట్లు తెలిసింది. దీంతో పదిమందికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం అర్ధరాత్రి జరగడం, సమీపంలో గ్రామాలేమీ లేకపోవడంతో గాయపడ్డవారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఎస్‌ఐ రంగనాథ్‌ గౌడ్‌ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాల్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు.



నుజ్జునుజ్జయిన ఆర్టీసీ బస్సు

● ఓటు వేసేందుకు వచ్చి..

ప్రమాదంలో చనిపోయిన వారిద్దరూ సమీప బంధువులని పోలీసులు తెలిపారు. ఓటు హక్కు వినియోగానికి ఈ ఇద్దరూ కూడా చెన్నై నుంచి కనిగిరికి వచ్చారు. ఇద్దరూ చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో అటెండర్లుగా పనిచేస్తున్నట్లు తెలిసింది. ఓటు వేసిన తరువాత రెండు రోజులు బంధుమిత్రులతో గడిపి చెన్నైకు బయలుదేరగా ఈ ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీ వెళ్తున్నట్లుగా భావించి ఆర్టీసీ డ్రైవరు బస్సు నడపడంతో ఈ ప్రమాదం సంభవించింది.



బస్సు ప్రమాదంలో గాయపడినవారు



డేవిడ్‌(ఫైల్‌)



మరియమ్మ(ఫైల్‌)



నెల్లూరులోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలిక

ఇంటర్‌ పరీక్ష ఫీజుకు నేటితో గడువు ముగింపు

నెల్లూరు(విద్య), మే 19 : ఇంటర్‌ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 20వ తేదీ చివరి గడువుగా ఇంటర్‌బోర్డు నిర్ణయించిందని ఆర్‌ఐవో డాక్టర్‌ ఏ.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్వాన్స్‌ సప్లిమెంటరీ పరీక్ష ఫీజును ఇప్పటి వరకు చెల్లించని విద్యార్థులు సోమవారం ఉదయం 10 నుంచి 3 గంటల లోపు తత్కాల్‌లో రూ.3వేల అపరాధ రుసుముతో కలిపి పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో అన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సమాచారాన్ని తెలియచేసి ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

టీడీపీకి ఓట్లేశారని తాగునీటి కుళాయికి డమ్మీ

● జిల్లా అధికారులకు ఫిర్యాదు

బుచ్చిరెడ్డిపాళెం, మే 19: ఎన్నికల్లో టీడీపీకి ఓట్లేశారని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ, మంగళపాళెంలోని సాతాని వీధిలో ఓ పంచాయతీ కుళాయికి నగర పంచాయతీ అధికారులు డమ్మీవేసిన వైనం ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. 40 ఏళ్ళకు పైగా అక్కడి ప్రజలకు నిత్యం తాగునీరందించే పంచాయతీ కుళాయికి శనివారం రాత్రి డమ్మీవేసినట్టు స్థానికులు గుర్తించారు. అసలే మండుటెండలు దీనికితోడు వున్న ఒక్క కుళాయికి డమ్మీ వేయడంతో ఆదివారం మధ్యాహ్నం వరకు ఆప్రాంతంలో ప్రజలు తాగునీటికోసం నానా అవస్థలు ఎదుర్కొన్నారు. నగర పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు జిల్లా పంచాయతీ అధికారులు, కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. స్పందించిన అధికారుల ఆదేశాలతో సాయంత్రానికి డమ్మీ తొలగించి కుళాయి ఏర్పాటుచేశారు. దీంతో తాగునీటి సమస్య తీరింది. ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈవిషయంపై నగర కమిషనర్‌ను వివరణ కోరగా సమస్య తమ దృష్టికి వచ్చిందని, వెంటనే డమ్మీ తొలగించి కుళాయి బిగించినట్టు చెప్పడం విశేషం.

చిరస్మరణీయుడు జేఎస్‌ రెడ్డి

● టౌనుహాలులో సంస్మరణ సభ

నెల్లూరు(సాంస్కృతికం), మే 19 : వ్యవసాయం, కళాపోషణ, వైద్యం, సామాజిక సేవా రంగాలలో జక్కా శ్రీనివాసులురెడ్డి (జేఎస్‌ రెడ్డి) చిరస్మరణీయుడు అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం రాత్రి టౌనుహాలులో ఆయన సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో సర్వేపల్లి మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, జమీన్‌ రైతు సంపాదకుడు ఎన్‌.డోలేంద్ర ప్రసాద్‌, వర్ధమాన సమాజం అధ్యక్షుడు పొన్నాల రామసుబ్బారెడ్డి, వాకాటి విజయకుమార్‌రెడ్డి, ఎంఆర్‌ ప్రసాద్‌లతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొని జేఎస్‌ రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన సేవలు, దాతృత్వంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

అక్క మృతిని జీర్ణించుకోలేక

ప్రాణం వదిలిన చెల్లెలు

● గంటల వ్యవధిలోనే ఇద్దరి మృత్యువాత ● శోకసంద్రంలో కుటుంబం

నెల్లూరు(క్రైం), మే 19: వారిద్దరూ.. ఒకరిని విడిచి ఒకరు ఉండలేరు. అక్క అంటే చెల్లెలికి ప్రాణం. అప్పుడప్పుడు గొడవలు పడుతున్నా క్షణాల వ్యవధిలో కలిసిపోయేవా రు. గొడవల్లో నీవల్ల నేను చనిపోయేలా..? ఉన్నానే అంటే... నువ్వు ఒక్కదానివే ఎందుకే.. ఇద్దరం కలిసి ఒకేసారి చనిపోదామని చెల్లెలు తమాషాలు పడేది. ఆ మాటలు విన్న కుటుంబసభ్యులు వారి ప్రేమను చూసి మురిసిపోయేవారు. అయితే నాడు చెల్లెలు తమాషాగా అన్న మాటలే.. నేడు నిజం అయ్యాయి. అనారోగ్యంతో అక్క మృతి చెందింద న్న విషయం తెలుసుకున్న గంటల వ్యవధిలోనే చెల్లెలు ఫిట్స్‌తో మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది.

నెల్లూరులోని పడారుపల్లిలో ఉదయగిరి మల్లికార్జున, యామిని దంపతులు ఉంటున్నారు. వారికి యమున, తులసి, యశస్విని కుమార్తెలు. మల్లికార్జున ఆర్మీలో పనిచేస్తూ రిటైర్‌ అయ్యారు. పెద్ద కుమార్తె యమున నవోదయ స్కూల్‌లో ఇంటర్‌ పూర్తి చేసి ప్రస్తుతం నీట్‌ రాసి ఇంటి వద్దే ఉంటున్నది. రెండో కుమార్తె తులసి అంగవైకల్యంతో మంచానికే పరిమితమైంది. యమున అనారోగ్యానికి గురికావడంతో కొంతకాలంగా చెన్నైలో చికిత్స పొందుతోంది. శనివారం ఉదయం ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని అదే రోజు సాయంత్రం 6 గంటలకు ఇంటికి తీసు కువచ్చారు. అక్క మరణించిందని తెలుసుకున్న చెల్లెలు తులసి కన్నీరుమున్నీరైంది. కుటుంబసభ్యులు ఓదార్చుతున్నా ఆమె శోకం ఆగలే దు. శనివారం రాత్రి 11 గంటల సమయం లో తులసికి ఫిట్స్‌ రావడంతో మంచంపైనే మృతి చెందింది. అక్కాచెల్లెలు గంటల వ్య వధిలో మృతి చెందడంతో కుటుంబసభ్యుల రోదనలు వర్ణణాతీతంగా మారాయి. కాగా ఈ నెల 24వ తేదీ యమున పుట్టినరోజు కావడంతో 'నవోదయ'లోని ఆమె స్నేహితు లు మృతదేహం వద్ద బోరున విలపించా రు. పార్థివదేహం ముందు కన్నీటితో కేక్‌ కట్‌ చేసి యమునకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ దృశ్యాలు చూసిన వారంతా కన్నీటి పర్యంతమయ్యారు.



మృతదేహం వద్ద కేక్‌ కట్‌ చేస్తున్న యమున స్నేహితులు



యమున (ఫైల్‌)



తులసి (ఫైల్‌)

ఉరుములు, మెరుపులతో వర్షం



పబ్బులేటిపల్లి వద్ద హైవేపై వర్షపు నీరు

సీతారామపురం, మే 19: వేసవి తీవ్రత వల్ల రెండు నెలల నుంచి అధిక ఉష్ణోగ్రతలు ఉక్కపోత, వేడిగాలులతో ఇబ్బందులు పడిన ప్రజలకు ఆదివారం వాతావరణం చల్లబడి ఉరుములు, మెరుపులతో కూడిన ఒక మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షానికి మండలంలోని సీతారామపురం నుంచి సీఎస్‌ పురం వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారిలో పబ్బులేటిపల్లి వద్ద రోడ్డుపై మోకాలి లోతులో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షానికి చెట్ల కొమ్మలు విద్యుత్‌ తీగలపై పడటంతో మండలంలో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందిపడ్డారు.

పిడుగు పాటుకు గేదె మృతి

మండలంలో ఆదివారం కురిసిన వర్షానికి పబ్బులేటిపల్లిలోని భూత పాటి రామయ్యకు చెందిన గేదె మృతి చెందింది. రామయ్య మాట్లాడుతూ ఒక్క సారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రావడంతో పిడుగు పాటుకు తమ ఇంటి బయట కట్టేసిన గేదె మృతి చెందినట్లు తెలిపారు. దీని విలువ రూ.50వేల వరకు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పుచ్చలపల్లి సేవలు మరువలేనివి

● సుందరయ్య వర్ధంతి సందర్భంగా నేతల ఘన నివాళి

ఆత్మకూరు, మే 19: కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని సీపీఎం, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం పట్టణంలోని డాక్టర్ చెర్లో ర మణారెడ్డి స్మారకభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య సేవలు మరువలేవని పేర్కొన్నారు. నిబద్ధత కలిగిన గొప్ప నాయకుడని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.డేవిడ్‌రాజు, జి.లక్ష్మీపతి, ఆత్మకూరు నాగయ్య, సీపీఎం పట్టణ కార్యదర్శి కె.డేవిడ్‌రాజు, నాగేంద్ర, సీఐటీయూ నాయకులు శివప్రసాద్, కొండమూరి హజరత్తయ్య, రైతు సంఘం కార్యదర్శి లక్ష్మప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సందాని, యస్థానీ, సాలారుద్దీన్, ఆళ్ల హజరత్తయ్య, ప్రజానాట్య మండలి కళాకారులు గద్దర్‌బాబు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని స్థానిక సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి షేక్ ఫరీద్దీన్‌బాష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. జిల్లాలోని అలగానిపాడులో 1913లో జన్మించారని గుర్తుచే సుకున్నారు. సైకిల్‌పై చట్టసభలకు వెళ్లిన నిరాడంబరుడని, నిస్వార్థంగా ప్రజాసేవ చేసి చరిత్ర పుటల్లో నిలిచారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో విజయం సాధించి ల క్షల ఎకరాల భూమిని పేద ల కు పంచి పెట్టిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో బండగాని పల్లి ఎంపీటీసీ కాకు విజయ మ్మ, రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య, సీపీఎం అను బంధ సంఘాల నాయ కులు దస్తగిరి అహ్మద్, రామిరెడ్డి, రంతూజాని, శ్యామ్‌ప్రసాద్, పి.వెం కటేశ్వర్లు పాల్గొన్నారు.


ఉదయగిరి: సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతసాగరం: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా సీపీఎం నాయకులు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మంగలి పుల్లయ్య, అన్వర్‌బాష, సుబ్బరాయుడు, గాడి సుధాకర్, వేము పెంచలయ్య పాల్గొన్నారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళాలు

కందుకూరు, మే 19: గ్రామదేవత అంకమ్మ ఆలయం అనివేటి మండపం నిర్మాణం కోసం దామా లక్ష్మీనారాయణ, సుజాత దంపతులు రూ. 10116, దామా వెంకటసాయినరేంద్ర, ప్రవల్లిక దంపతులు రూ. 2116 విరాళంగా ఆలయ కమిటీ సభ్యుడు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డికి అందజేశారు.

కామ్రేడ్ పుచ్చలపల్లి జీవితం ప్రజాసేవకు అంకితం

కావలిటౌన్, మే 19: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య అధ్యక్షతన ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో జరిగిన కార్యక్రమంలో సుందరయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ సుంద రయ్య జీవితం ప్రజాసేవకు, కమ్యూనిష్టు ఉద్యమానికి అంకితమిచ్చారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుబ్బరాయ శర్మ, మల్లికార్జునరావు, మధుసూదన్‌రావు, తిరుపాల్, కృష్ణయ్య, కల్లయ్య పాల్గొన్నారు.


కావలిటౌన్: సుందరయ్య చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నేతలు, అభిమానులు

బిట్రగుంట: పుచ్చలపల్లి సుందరయ్య పేద ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా నాయకురాలు షేక్ రెహనాబేగం అన్నారు. బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ బాదుల్లా, చిన్నకొండయ్య, ఎన్ రామయ్య, ఉప్పాల ఎల్లయ్య, డమ్ము భాస్కర్, రంతుల్లా, శంకరయ్య, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

జలదంకి: స్థానిక సిపిఎం కార్యాలయం సూరే చెంచురెడ్డి భవన్‌లో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తాళ్ళూరి మాల్యాద్రి, రావి మాల్యాద్రి, గడ్డం మాల్యాద్రి, గడ్డం విజయలక్ష్మీ, మేలంగి ఆంథోనీ, సిపిఐ నాయకులు దమ్ము దర్గాబాబు పాల్గొన్నారు.

గుడ్లూరు: మండల కేంద్రమైన గుడ్లూరుతోపాటు చేవూరు, నరసాపురం, గుడ్లూరు విద్యుత్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో సుందరయ్య వర్ధంతిని ఆదివారం వివిధ ప్రజాసంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గుడ్లూరు బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన వర్ధంతి కార్యక్రమంలో భాగం గా సీపీఎం జెండాను సీనియర్ నాయ కులు దామా కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు మండల సీపీఎం కన్వీనర్ గంటెనపల్లి వెంకటేశ్వర్లు, దామా కృష్ణ, ఎం జాలయ్య, ఎం వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: మండలంలోని అంకభూపాలపురంలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకుడు కుమార్, సిపిఎం నాయకులు సాధు చెన్నకేశవులు, సుబాను, వెంకటేశ్వర్లు, జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కలశ స్థాపన


పాండురంగ విఠలేశ్వర స్వామికి హారతిస్తున్న పూజారి ఉమామహేశ్వర శర్మ

సీతారామపురం, మే 19: పంద్రంగి సమీపంలో వెలసిన పాండురంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రిత్వికుల ఆధ్వర్యంలో కలశ స్థాపన, గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి సీతారామపురం కోట వీధివాసులతో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు.

వివాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా ఉండాలి

వరికుంటపాడు, మే 19: గ్రామంలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ప్రతిఒక్కరూ ప్రశాంత వాతావరణంలో కలిసి మెలిసి ఉండాలని కావలి డీఎస్పీ వెంకటరమణ తెలిపారు. ఆదివారం జడదేవిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికలు పూర్తయిన నేప థ్యంలో త్వరలో కౌంటింగ్ జరుగు తుందన్నారు. గెలుపోటములను దృష్టిలో ఉంచుకొని అనవసరమైన ఆవే శాలతో గొడవలకు దిగకుండా జాగ్ర త్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పెద్దలు బాధ్యతగా తీసుకొని తమ పిల్లలు, యువ తకు అవగాహన కల్పించాలన్నారు. తనకు తెలిసి ఇంతవరకు గ్రామంలో గొడవలు జరిగినట్లు ఫిర్యాదులు అందలేదన్నారు. ప్రస్తుతం అదే స్ఫూర్తితో వ్యవహరించి ఆదర్శంగా నిలవాలన్నారు. ఒకసారి తప్పు జరిగినట్లు రికార్డుల్లో నమోదైతే శాశ్వతంగా చెడ్డపేరు వస్తుందని హెచ్చరిం చారు. కార్యక్రమంలో సీఐ గిరిబాబు, ఎస్ఐ తిరుపతయ్య పాల్గొన్నారు.


వరికుంటపాడు: మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరమణ

యువనేస్తం ఆధ్వర్యంలో రక్తదానం


రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందచేస్తున్న రెడ్‌క్రాస్ నిర్వాహకులు

సంగం, మే 19: సిద్దీపురం ప్రాథమికోన్నత పాఠశాలలో అదే గ్రామానికి చెందిన యువనేస్త సేవా ఫౌండేషన్ సభ్యులు ఆదివారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. నెల్లూరు రెడ్‌క్రాస్ నిర్వాహకులు యువకుల నుంచి రక్తం స్వీకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో రెడ్‌క్రాస్ నిర్వాహకులు ప్రతిఏడాది రక్తదానం యువకులను అభినందించి రెడ్‌క్రాస్ తరుపున సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో యువనేస్తం సేవా ఫౌండేషన్ సభ్యులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంతో శక్తిసామర్థ్యాలు పెరుగుతాయి

ఆత్మకూరు, మే 19: ధ్యాన సాధనతోనే రోగాలు దూరమవుతాయని, మనిషిలో ప్రశాంతత పెరిగే కొద్దీ అతని విజయాలు, శక్తిసామర్థ్యాలు పెరుగుతాయని సీనియర్ పిరమిడ్ మాస్టర్లు బండి శ్రీనివాసరావు, సుజనాదేవి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండుకు ఎదురుగా ఉన్న శ్రీషిర్డీసాయి పిరమిడ్ కేంద్రంలో ఆదివారం ఆత్మజ్ఞాన శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవిత లక్ష్యాలు, నమ్మకాలు, ఆలోచనలు, సంకల్పాలు తదితర అంశాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. బుద్ధభగవానుడి అష్టాంగమార్గం మనశ్శాంతికి, ముక్తికి మంచిమార్గమన్నారు. మనశ్శాంతి పొందాలంటే మనస్సును సాత్వికగుణంలో ఉంచుకోవాలని, అందుకు ధ్యానం ఒక్కటే మార్గమని తెలిపారు. ధ్యానంతో బుద్ధిబలం పెరగడంతో పాటు శరీరంలో నాడీశుద్ధి జరిగి రోగాలు దూరమవుతాయన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం ఉపయుక్తమని తెలిపారు. సర్వజీవులను ప్రేమతో, కరుణతో ఆదరించి జీవహింసను రూపుమాపేందుకు ధ్యానసాధకులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్లు డాక్టర్ చంద్రా సుబ్రహ్మణ్యం, సీహెచ్ విజయ, మూరంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, పలువురు ధ్యాన సాధకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ పిరమిడ్ మాస్టర్ బండి శ్రీనివాసరావు

అన్నప్రసాద వితరణ భవనం నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న దామా వెంకటేశ్వర్లు

కందుకూరు, మే 19: పట్టణంలోని అయ్యప్పస్వామి గుడివద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవనానికి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త దామా వెంకటేశ్వర్లు, రమాదేవి దంపతులు రూ. 50వేలు విరాళంగా అందజేశారు. ఆదివారం అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పసేవాసంఘం కమిటీ సభ్యులకు ఈ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో నలబోతుల మురళీ, మాదాల వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

కావలిలో టీడీపీ విజయం తథ్యం

● కావ్య క్రిష్ణారెడ్డికి కమ్మవారి సేవాసమితి సన్మానం


కావ్య క్రిష్ణారెడ్డిని సన్మానిస్తున్న కమ్మవారి సేవాసమితి సభ్యులు

కావలి, మే 19: కావలిలో టీడీపీ విజయం తథ్యమని, ఇందులో కమ్మవారి కృషి అనిర్వచనీయమని ఎన్డీఏ కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కమ్మవారి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం క్రిష్ణారెడ్డిని ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా కమ్మవారి సేవాసమితి నాయకులు మాట్లాడుతూ కావ్య క్రిష్ణారెడ్డి భారీ మెజార్టీతో గెలవబోతున్నారని, కావలిలో అరాచక పాలన, రౌడీయిజం పోయి ప్రశాంతత రాబోతుందన్నారు. కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం జెండా తమదిగా భావించి నిద్రాహారాలు మాని కావలిలో టీడీపీకి పట్టంకట్టి చంద్రబాబుకు కావలిని కానుకగా ఇవ్వబోతున్న కమ్మ సోదర సోదరీమణులకు ధన్యవాదాలు తెలిపారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి రాజకీయ పదవులలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడుతూ ఐక్యతతో పనిచేసి కావలిలో క్రిష్ణారెడ్డిని గెలిపిస్తున్నామని, అందుకు దోహదపడ్డ ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మవారి సేవాసమితి కావలి శాఖ అధ్యక్షుడు మాకినేని మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, కోశాధికారి రాయుడు, గుత్తికొండ కిషోర్, బొట్లగుంట శ్రీహరినాయుడు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, వ్యోశాంతి రమణయ్య, చల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి జీవ ఎరువుల వినియోగంపై అవగాహన సదస్సులు

కందుకూరు, మే 19: పీఎం ప్రణం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు జీవ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వి రాము ఒక ప్రకటనలో తెలిపారు. 20న మాచవరం, మోపాడు, 21న కొండముడుసుపాలెం, కంచరగుంట, 22న కోవూరు, పందలపాడు, 23న విక్కిరాలపేట, కొండికందుకూరు, 24న మహదేవపురం, పలుకూరు, 25న ఆనందపురం, ఓగూరు, 27న పాలూరు, వెంకటాద్రిపాలెం, 28న జి. మేకపాడు గ్రామాలలో ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, జిల్లా వనరుల కేంద్రం అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. రైతులు ఈ సదస్సులకు హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా దత్తాత్రేయస్వామి ఆరాధనోత్సవం

లింగసముద్రం, మే 19: మండలంలోని మొగిలిచెర్ల సమీపంలోని మన్నేరు ఒడ్డున ఉన్న దత్తాత్రేయస్వామి ఆరాధన మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. స్వామిని దర్శించుకొనేందుకు భక్తులు ఉదయం 6 గంటల నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలి వచ్చారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ మంచినీరు, అన్నదానం ఏర్పాటుచేశారు. అలాగే రాత్రి దత్తదీక్ష మాలాధారణ స్వాములచే పండరి భజన, అగ్నిగుండ ప్రవేశం జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడ్లూరు సీఐ బివివి సుబ్బారావు, ఎస్సై ఎం బాజీబాబు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.


ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న దత్తాత్రేయస్వామి

ఘనంగా ఆత్మీయ సమావేశం


సమావేశమైన పూర్వవిద్యార్థులు

సంగం, మే 19: స్థానిక జీబీకేఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 2004 -2005లో పది చదివిన విద్యార్థులు ఒకటై పాఠశాలలో గడిపిన జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. నాడు చదివిన తరగతి గదులు, ఆటలాడిన క్రీడా మైదానం కలియ తిరిగి విద్యార్థిగా చేసిన చిలిపి పనులకు గుర్తు చేసుకుని సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. నాడు చదువు చెప్పిన గురుకులను సత్కరించారు.

10వ తరగతి ప్రతిభా విద్యార్థులకు పురస్కారం

ఆత్మకూరు, మే 19: పదో తరగతిలో 475మార్కులు తెచ్చుకున్న యాదవ విద్యార్థులకు ఈ నెల 26న ఉదయం 8 గంటల నుంచి నెల్లూరులోని అపోలో హాస్పటల్ ఎదురుగా ఉన్న జెట్టి శేషారెడ్డి విజ్ఞాన భవన్‌లో ప్రతిభా పురస్కారం ఇవ్వనున్నట్లు యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ల కొండయ్య తెలిపారు. ఆదివారం ఈ విషయంపై వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని యాదవ విద్యార్థులందూ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అర్హులందరూ ముందుగా సెల్: 95731 05305, 97058 00794 నెంబర్లుకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు డివిజన్ నాయకులు గాలిబోయిన అయ్యన్న, కఠారి సుధాకర్, వెటర్నరీ డాక్టర్ కృష్ణయ్య తెలిపారు. శ్రీకృష్ణ సేవాసమితి నాయకులు పి.రమణ, మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు జేవీవీ ప్రతిభా పురస్కారాలు

కావలిటౌన్, మే 19: జేవీవీ ఆధ్వర్యంలో ఆదివారం పాతూరులోని రవి నర్సింగ్‌హోమ్ సమావేశ మందిరంలో పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు పురస్కారాలతో సత్కరించి అభినందించారు. జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవి కుమార్, ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు మనోహర్ బాబు, డాక్టర్ శివప్రసాద్ పాల్గొని విద్యార్థులను నగదు పురస్కారాలతో అభినందించారు. అత్యధిక మార్కులు సాధించిన జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని నీరజను శాలువాతో సత్కరించారు. అతిథులు మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణకు జేవీవీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

చిన్నారులకు ఖోఖో పోటీలు

ఉలవపాడు, మే 19 : వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు ఖోఖో పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం గ్రంథాలయానికి విచ్చేసిన 35 మంది విద్యార్థులకు తొలుత పుస్తక పఠనం చేయించి, జనరల్ నాలెడ్జ్‌పై సామర్థ్యాలను పరీక్షించినట్లు చెప్పారు. పిల్లల మానసిక వికాసం కోసం రోజుకో క్రీడతో వారికి శారీరక, మానసిక ఉత్సాహాన్ని కలిగిస్తున్నట్లు గ్రంథపాలకుడు తెలిపారు. అనంతరం చిన్నారులకు శీతల పానీయాలు అందచేశామన్నారు.


ఖోఖో ఆడుతున్న చిన్నారులు

పైపైకి కూరగాయల ధరలు

● కాకర, క్యాప్సికం కిలో రూ.120

● కేజీ పచ్చి మిర్చి రూ.100 ● మిగిలినవి ఏవైనా రూ.60పై మాటే...!

ఉదయగిరి, మే 19: రోజురోజుకు కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పదిరోజులు వరకు నిలకడగా ఉన్న ధరలు ఇప్పుడు చుక్కలు చూపిస్తున్నాయి. ఓవైపు ఎండ తీవ్రత, మరోవైపు వర్షాలు కురుస్తుండడంతో కూరగాయల సాగుపై ప్రభావం పడింది. సరైన దిగుబడి లేక వీటి ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. ఇదే అదునుగా వ్యాపారులు ధరలు పెంచి నిలువు దోపిడీ చేస్తున్నారు. పచ్చిమిర్చి ధర మంట పుట్టిస్తోంది. నిన్నటివరకు మార్కెట్‌లో కిలో రూ.40లు ఉండగా, ఇప్పుడు రూ.100లకు చేరింది. బెండకాయలు రూ.20 నుంచి రూ.60కి, బంగాళదుంపలు రూ.25నుంచి రూ.50, దొండకాయలు రూ.30 నుంచి రూ.70, బీరకాయలు రూ.40 నుంచి రూ. 80, వంకాయ రూ.40 నుంచి రూ.80, బీట్రూట్ రూ.40నుంచి రూ.60లకు, ఉల్లిపాయలు రూ.20 నుంచి రూ.30, దోసకాయ రూ.30, క్యారెట్ రూ.40లు, టమోటా రూ.30లు, క్యాప్సికం రూ.120లు పలుకుతున్నాయి. ఆకు కూరల ధర సైతం పెరగడంతో వినియోగదారులు విలవిల్లాడుతున్నారు. గతంలో రూ.10లకు ఐదు కట్టల చొప్పున ఇస్తున్న తోట, చిర్రి, పొన్న గంటి ఆకుకూర కట్టలు ప్రస్తుతం రూ.20లకు ఐదు కట్టలు ఇస్తున్నారు. సామాన్యులు కూరగా యలు కొనలేక పచ్చడి మెతుకులతోనే సరిపెట్టుకుంటున్నారు.


కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి

ఏమీ కొనలేం..



ప్రస్తుతం మార్కెట్‌లో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కూరగాయలు కొనే పరిస్థితి లేదు. ధరలు విపరీతంగా పెరగడంతో పచ్చడి మెతుకులతోనే సరిపెట్టుకుంటున్నాం.

-రమణమ్మ, ఉదయగిరి

వైద్యులకు సన్మానం


మాట్లాడుతున్న వైద్యులు ఏడుకొండలు, సుధాకర్

బిట్రగుంట, మే 19: బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వర్ణన్‌రాజ్ ఆధ్వర్యంలో మన ఊరు మన వైద్యులకు సన్మానం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రైల్వే వైద్యులు సుధాకర్, ప్రముఖ వైద్యులు ఏడుకొండలు, విజయేంద్ర, చంద్రశేఖర్, ఆనందసాగర్, తిరుపతమ్మ, తదితరులను వాకర్స్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు, జీవన్‌కుమార్, కుందుర్తి శ్రీనివాసులు, సత్యనారాయణ చార్యులు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ రాజకీయవేత్త శ్యాంసుందరనాయుడు మృతికి సంతాపం

జలదంకి, మే 19: కావలి మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి కొండపనాయుడు సోదరుడు శ్యాంసుందరనాయుడు (80) శనివారం కావలి పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో గుండెపోటుతో మృతిచెందారు. చింతల పాలెంలోని ఆయన స్వగృహంలో మృతదేహాన్ని వివిధ పార్టీలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, జలదంకి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, కేశవరం, కమ్మవారిపాలెం సర్పంచ్‌లు రావి ప్రసాద్‌నాయుడు, తమ్మినేని సతీష్‌నాయుడు సంతాపం వ్యక్తం చేశారు.


గొట్టిపాటి శ్యాంసుందర నాయుడు(ఫైల్)

భగవద్గీతపై ప్రచారం

ఉదయగిరి రూరల్, మే 19: దుత్తలూరు త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి, ఇందుజ్ఞాన వేదిక సభ్యులు ఆదివారం గండిపాళెంలో భగవద్గీతపై కరపత్రాలు పంపిణీ చేసి విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు జి.ప్రసాద్, సభ్యులు కె.వెంకటేశ్వర్లు, జి.పెంచలరత్నం, కె.నరసింహులు, ఎం.నాగమ్మ, డి.రమణయ్య, ఎస్.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.


దుత్తలూరులో ప్రచారం చేస్తున్న ఇందు జ్ఞాన వేదిక సభ్యులు

అస్తవ్యస్త డ్రైనేజీతో అవస్థలు

వింజమూరు, మే 19: పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నా ప్రజలకు కనీస అవసరాలను కల్పించడంలో ప్రభుత్వం విఫల మవుతుంది ముఖ్యంగా ప ట్టణంలో మురుగు కాలువల పరిస్థితి దారుణంగా ఉంది. కాలువలల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు రోడ్డు మీదికి చేరి పాదచారులకు అసౌకర్యం కలిగిస్తుంది. అలాగే దోమలు కూడా విజృంభిస్తున్నాయి. ము ఖ్యంగా వైశ్య బజార్, మెయిన్ రోడ్డు కాలువలలో పూడిక తీయకపోవడంతో రోడ్డు మీద నీరు పారుతోంది. పంచాయతీ అధికారులకు చెప్పినా స్థాని కులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారే కానీ కనీస అవసరాలను పట్టించుకోవడం లేదని చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.


రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు

అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు : సీఐ

కావలి రూరల్, మే 19: కావలి పట్టణం ఇస్లాంపేట, వైకుంఠపురంలోని పలు ఇళ్లల్లో ఆదివారం 1వ, 2వ పట్టణ, సిఐలు రాజేష్, కొండవీటి శ్రీనివాసరావులు స్పెషల్‌పార్టీ పోలీసులతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎలాంటి అలజడులు సృష్టించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీలలో వైకుంఠపురంలో ఎలాంటి పత్రాలు లేని 9 బైకులు, ఇస్లాంపేటలో 13 బైక్‌లు, 2 ఆటోలు, కత్తులు, గొడ్డళ్లవంటి కొన్ని మారణాయుధాలు స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, స్పెషల్‌పార్టీ పోలీసులు పాల్గొన్నారు.


కావలి రూరల్: వైకుంఠపురంలో స్వాధీనం చేసుకున్న వాహనాలు

కప్పరాళ్లతిప్పలో...

బిట్రగుంట : బోగోలు మండలం కప్పరాళ్ళ తిప్పలో రూరల్ సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడించే సమయంలో ఎటువంటి గొడవలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తగా ఇళ్లు తనిఖీ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ధ్రువీకరణ పత్రాలు లేని 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, వాటి పత్రాలు చూపించినట్లయితే తిరిగి ఇచ్చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దగదర్తి ఎస్సై మర్రినాయుడు, అల్లూరు ఎస్సై శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఓగూరులో...

కందుకూరు : ఓగూరు ఎస్సీ కాలనీలో ఆదివారం ఉదయం కందుకూరు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కందుకూరు టౌన్, రూరల్, ఉలవపాడు ఎస్ఐలు సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఓగూరులో పెద్దఎత్తున ఇతర రాష్ట్రాల మద్యం అక్రమ నిల్వలు ఉన్నట్లు అందిన సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహించగా కాలనీకి చెందిన దార్ల క్రాంతికుమార్ ఇంట్లో 90 మద్యం సీసాలు లభించాయి. క్రాంతికుమార్ పెద్దఎత్తున ఇతర రాష్ట్రాల మద్యం తెప్పించి ఇక్కడ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఆ మద్యాన్ని స్వాధీనం చేసుకుని క్రాంతికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఖాళీ జాగా... వేసేయ్ పాగా !

● కబ్జాలో నగర పంచాయతీ స్థలాలు

● పట్టించుకోని అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 19: ఖాళీ జాగా కనబడితే చాలు వేసేయ్ పాగా అన్న చందంగా బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ప్రభుత్వ స్థలాలు తరచూ కబ్జాకు గురవుతున్నాయి. కబ్జాలపై పలువురు ఫిర్యాదు చేసినా నగర పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు స్థానిక ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని ఇస్కపాళెం పరిధిలో బుచ్చి, జొన్నవాడ మార్గం వద్ద కొయ్యలమిల్లుకు పక్కన సెంట్రల్ ఛానల్ కాలువ పోరంబోకు స్థలం కబ్జాకు గురైంది. సమాచారం ఇచ్చినా ఆ దిశగా కనీస చర్యలు కూడా లేవని ఆ ప్రాంతంలో పలువురు వాపోతున్నారు. కబ్జాచేసే సమయంలో చెప్పినా, నిర్మాణం పూర్తికావస్తున్నా ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అధికారులే పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.



ఇస్కపాళెం పరిధిలో కబ్జాకు గురైన సెంట్రల్ చానల్ కాలువ పోరంబోకు స్థలంలో నిర్మిస్తున్న షెడ్డు

ఈ విషయంపై నగర పంచాయతీ కమిషనర్‌ను వివరణ కోరగా కబ్జాకు విషయం తమ దృష్టికి వచ్చింది... ఎన్నికల హడావుడి వల్ల జాప్యమైందని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

పుచ్చలపల్లికి ఘన నివాళి



కోవూరు : నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కోవూరు, మే 19: భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పట్టణంలోని బజారుకూడలిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కమిటీ కార్యదర్శి గండవరపు శేషయ్య మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ఆయన సాగించిన పోరాటం ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు జక్కా శేషమ్మ, సీపీఎం నాయకులు బాబు, మారుబోయిన సుబ్బారావు, ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి కళాకారులు సుందరయ్యపై పాడిన పాటలు ఆకట్టుకున్నాయి.

బుచ్చిరెడ్డిపాళెం : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం బుచ్చిరెడ్డిపాళెం బస్టాండ్ సెంటర్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా చలివేంద్రం ఏర్పాటుచేసి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున మాట్లాడుతూ పేద ప్రజల కోసం భూపోరాటాలు చేసి వేలాది ఎకరాల భూమిని వారికి పంచిపెట్టారన్నారు. ఆయన స్ఫూర్తితో యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. కాగా, పట్టణ కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి ఆవాజ్ నాయకులు జానీబాష పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు షేక్ మునీర్ అహ్మద్, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఖాదర్‌బాష, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొడవలూరు : పుచ్చలపల్లి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు గొని దయాకర్ అన్నారు. మండలంలోని నార్తు రాజుపాలెంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అలుపెరగని పోరాటం చేసిన యోధుడన్నారు. యువతకు ఆయన ఆదర్శప్రాయుడని తెలిపారు. కాగా, గ్రామ ప్రధాన కూడలి వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆయన వెంట సీపీఎం నాయకులు నరసింహులు, శ్యాములు తదితరులున్నారు.

వెంకటాచలం : సర్వేపల్లి గ్రామంలో ఆదివారం సీపీఎం నాయకులు పుచ్చపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఓడూరు వెంకటకృష్ణయ్య, నాయకులు షేక్ చాన్‌బాషా, బిక్కి రవి, షేక్ నజీర్ ఉన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

మనుబోలు : స్థానిక ఆటోస్టాండు వద్ద ఆదివారం ఆటోకార్మికులు ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆటో కార్మిక యూనియన్ అధ్యక్షులు శివయ్య, గౌరవాధ్యక్షులు ఆలూరు రమేష్, బలరామయ్య, శ్రావణ్‌కుమార్, ఖాదర్‌వలి పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం : మజ్జిగ పంపిణీ చేస్తున్న సీఐటీయూ నాయకులు



కొడవలూరు : పుచ్చలపల్లికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఘనంగా చౌడేశ్వరి గ్రామోత్సవం

మనుబోలు, మే 19: మడమనూరులో శనివారం అర్ధరాత్రి రామలింగ చౌడేశ్వరి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రతి ఐదేళ్లకో సారి దేవాంగ సంఘం ఆధ్వర్యంలో చౌడేశ్వరి తిరునాళ నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా అమ్మవారిని కొలువుకూటమిలో ఉంచి బిందె తీర్థం కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం వసంతోత్సవం నిర్వహించి కలశోద్వాసన నిర్వహించారు. శనివారం శాంత స్వరూపం అలంకరణలో గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాలను తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు.



గ్రామోత్సవంలో చౌడేశ్వరి దేవి

125 కేసుల నమోదు

ఇందుకూరుపేట, మే 19 : స్థానిక సెబ్ స్టేషన్ పరిధిలోని ఇందుకూరుపేట, టీపీగూడూరు, ముత్తుకూరు మండలాల్లో ఎన్నికల్లో భాగంగా 125 కేసులు నమోదు చేసి 131 మందిని అరెస్టు చేశామని, 1408 లీటర్ల మద్యం, మూడుకార్లు, 7 బైక్‌లు సీజ్ చేశామని సీఐ శ్రీనివాసులు తెలిపారు.

నిలిచిన ఎగుమతులు : పడిపోయిన నిమ్మ ధర

పొదలకూరు, మే 19 : జిల్లాలో అత్యధికంగా నిమ్మ సాగు చేసే ప్రాంతాల్లో పొదలకూరు ఒకటి. అధిక విస్తీర్ణంలో తోటలు ఇక్కడ సాగవుతున్నాయి. ఏటా నిమ్మ రైతులకు గడ్డుకాలమే దాపురిస్తున్నది. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడమో.. అన్ని కలిసొస్తే ధర పలకకపోవడమో.. వంటి కారణాలతో రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. ఈ సారీ కూడా అవే పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ ఏడాది దిగుబడి బాగుందని రైతులు ఎంతో సంబరపడ్డారు. తీరా చేతికొచ్చి కోసే సమయంలో ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. వారం క్రితం కేజీ రూ.80 నుంచి రూ.90 అమ్మిన నిమ్మకాయలు గత రెండు రోజులుగా కేజీ రూ.40కి అమ్ముతున్నారు. ఏటా ఏప్రిల్ నుంచి జూన్, జూలై వరకు కాయలకు మంచి డిమాండ్ ఉంటుంది. వేసవిలో ఉపశమనం కోసం పలువురు కూల్‌డ్రింక్స్‌ను ఆశ్రయిస్తుంటారు. వీటిలో నిమ్మను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. దీంతో ఉత్తర భారత దేశానికి పొదలకూరు ప్రాంతం నుంచి అత్యధికంగా నిమ్మను ఎగుమతి చేసేవారు. రెండు వారాలుగా ఉత్తరాది రాష్ట్రాల్లో చల్లటి వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడక్కడ వర్షాలు కూడా పడుతున్నాయి. దీంతో ఒక్కసారిగా నిమ్మ ఎగుమతులు తగ్గిపోయాయి. ఫలితంగా ఏప్రిల్‌లో కిలో రూ.80 వరకు ధర పలికితే ప్రస్తుతం సగానికి పైగా పడిపోయి కేవలం రూ.40 మాత్రమే దక్కుతోంది. దీంతో రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. విధి లేని పరిస్థితుల్లో కొందరు కోత కూలీ ఖర్చులైనా మిగులుతాయని కోయకుండానే చెట్లకు వదిలేస్తున్నారు.

గ్రామాల్లో ప్రబోధ సేవా సమితి ప్రచారం

వెంకటాచలం, మే 19: కాకుటూరు, కుంకుమపూడి, చెముడుగుంట, బురాన్‌పూర్‌లో ఆదివారం త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు.

కామాక్షితాయికి పెద్ద వెండి నందిసేవ

బుచ్చిరెడ్డిపాళెం, మే 19: మండలంలోని జొన్నవాడ ఆలయంలో ఆదివారం శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి వారికి పెద్ద వెండినంది వాహన సేవ వైభవంగా జరిగింది. ప్రత్యేక పుష్పాలంకరణ, భక్తజనం నడుమ వెండి నంది వాహనంపై స్వామి, అమ్మవారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి నెల్లూరుకు చెందిన బిరుదల వెంకట రామ్మోహన్, కామాక్షి దంపతులు, తదితరులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, మే 19 : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా నెల్లూరు రవీంద్రారెడ్డి మహాత్మాగాంధీ, పొణక కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, నూలు మాలలు సమర్పించారు. అనంతరం కమిటీ సభ్యులు కందికట్టు రాజేశ్వరి, గంటా విజయశ్రీ యువతకు గాంధీ ఆశయాలు, గాంధీ ఆశ్రమ చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, దార్ల సుబ్రహ్మణ్యం, గ్రామస్థులు, తదతరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల ఫలితాల దృష్ట్యా కార్టన్ సెర్చ్

మనుబోలు, మే 19: మరో 15రోజుల్లో ఎన్నికల ఫలితాలు రానున్న నేపథ్యంలో జిల్లా పోలీస్‌బాస్ ఆదేశాల మేరకు గ్రామాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు పొదలకూరు సీఐ రాంబాబు తెలిపారు. ఆదివారం ఆయన మనుబోలులోని బీసీ కాలనీలో ఎస్ఐ అజయ్‌కుమార్, సిబ్బంది ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు కనిపించినా, వాహనాలు తిరుగుతున్నా సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందజేయాలన్నారు.



మనుబోలు బీసీ కాలనీల్లో పర్యటిస్తున్న పోలీసులు

ఒక్కో ఇంట్లో ఎంతమంది ఉంటున్నారు, బయటనుంచి ఎవరైనా వ్యక్తులు వచ్చి తిష్టవేసి ఉన్నారా ఆరా తీశారు. ఫలితాలు వచ్చేవరకు ప్రజలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విజయం తథ్యం

కొడవలూరు మే 19 : కోవూరు కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విజయం తథ్యమని, వైసీపీ నాయకులు పగటి కలలు మానుకోవాలని మాజీ టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు జొన్న శివకుమార్ అన్నారు. మండలంలో తలమంచి గ్రామంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అరాచకపు పాలన అంతమొందించాలనే లక్ష్యంతో పెద్దఎత్తున యువత, మహిళలు మార్పు కోరుతూ ఆమెకు పట్టం కట్టారన్నారు. వీపీఆర్ దంపతులు రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు ఉచితంగా కార్పోరేటు వైద్యం అందించి ఆదుకుంటున్నారన్నారు. జిల్లాలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటుచేసి ఆదుకుంటున్నారన్నారు. వారు చేసిన సేవా కార్యక్రమాలే వారిని భారీ మెజారిటీ తో గెలిపించబోతున్నాయన్నారు. వేమిరెడ్డి దంపతులు ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. జిల్లాకు మహర్దశ రానున్నదని, ఈ సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ అధికారం చేపట్టబోతున్నదని, ముఖ్యమంత్రిగా చంద్రబాబు రానున్నారన్నారు. ఆయన ప్రభుత్వంలో జిల్లాలో తొలి మహిళా మంత్రిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కానున్నారన్నారు. నియోజకవర్గంలో వైసీపీ నాయకులు చేసిన అన్యాయాలు, అక్రమాలకు 4వ తేదీన వేమిరెడ్డి విజయంతో తెరపడనున్నద న్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నియోజకవర్గాన్ని గ్రావెల్, ఇసుక, మట్టి మాఫియాలకు అడ్డాగా మార్చారన్నారు. అక్రమాలను అడిగిన వారిపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేశారన్నారు. కోవూరు ప్రశాంతంగా ఉండాలంటే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితోనే సాధ్యమని తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు తదితరులున్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

అమ్మో.. ఆ ఇద్దరు..!


● ఎన్ఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో అక్రమ వసూళ్ల రాజాలు

● ఏఈఈ, డీఈఈ, ఈఈల వద్ద ముక్కు పిండి..

● ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యుల ఖర్చుల పేరిట దందా

● ప్రతి నెలా వీరి నుంచే పై స్థాయి అధికారులకు వాటాలు

నెల్లూరు(సిటీ), మే 19 : ఉన్నతాధికారి వ్యక్తిగత పనుల రీత్యా బయటకు వెళ్తున్నాడు.. ఆయన ఖర్చులకు డబ్బులివ్వండి..! ఈ నెల పేషీ ఖర్చులు మీరే చూసుకోవాలి..! ఆ.. అధికారికి రెండు రోజుల పాటు పర్సనల్‌గా కారు అద్దెకు కావాలి.. అదేదో చూసుకోండి..! సర్ వాళ్ల ఫ్యామిలీ వస్తున్నారు.. వాళ్ల విమాన ఖర్చులు మీరే భరించాలి..! అంటూ ఇంజనీరింగ్‌లో ఇద్దరు ఏఈఈలు ఆర్థిక దందాలకు తెరలేపారు.



ఇంజనీరింగ్ విభాగం నుంచి ప్రతి నెల ఉన్నతాధికారులకు ఇవ్వాలంటూ మామూళ్లు దండుతున్న ఆ ఇద్దరు అవినీతికి కేరాఫ్‌గా మారారు. వీరికి కేటాయించిన డివిజన్లలో జరుగుతున్న పనుల పై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ఈ దందా నెల్లూరు కార్పొరేషన్‌లో జరుగుతుండటం విశేషం.

నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో రూ.కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. వీటిల్లో 15 శాతం వరకు కాంట్రాక్టర్ల వద్ద ఏఈఈ, డీఈఈ, ఈఈలతో పాటు పలువురు ఉన్నతాధికారులు పర్సెంటేజీలు వసూళ్లు చేస్తుంటారు. వీరితో పాటు బిల్లులు పాస్ చేసే పలు విభాగాల్లోనూ కాంట్రాక్టర్లు కమీషన్లు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో ఇంజనీరింగ్ విభాగం అవినీతిమయంగా మారింది. ఈ విభాగం నుంచి ఇద్దరు ఏఈఈలు ఆధిపత్యం చెలాయిస్తూ మిగిలిన అధికారుల వద్ద ప్రతి నెలా ఉన్నతాధికారుల ఖర్చుల పేరిట పైకి పంపాలంటూ మామూళ్లు వసూళ్లు చేస్తున్న సంఘటన ఆశ్చర్యకరంగా మారింది. ఉన్నతాధికారుల వ్యక్తిగత జీవిత ఖర్చులు, వారి కుటుంబాలు విమాన ప్రయాణ ఖర్చులు, కార్పొరేషన్‌లో పేషీ ఖర్చులు, కొందరు పైస్థాయి అధికారులకు అద్దె కారు, బయట ప్రాంతాలలో హోటళ్ల, ఇతర ఖర్చులు, కార్పొరేషన్‌కు సంబంధం లేకుండా ఇతర జిల్లాస్థాయి ఉన్నతాధికారులకు బయట, వ్యక్తిగత జీవితాలకు ఏర్పడే ఖర్చులు చెల్లించాలంటూ ఈ ఇద్దరూ నెల మామూళ్ల కింద ఇంజనీరింగ్ అధికారుల వద్ద ఆర్థిక దందా నిర్వహిస్తున్నట్లు సమాచారం.

● ఖర్చు పెడుతున్నారా..?

ఎన్ఎంసీలో కాంట్రాక్టర్ల వద్ద మితిమీరిన కమీషన్లు వసూళ్లు చేస్తున్న ఇంజనీరింగ్ అధికారులు అందులో కొందరు పై స్థాయి అధికారుల ఖర్చులకు ఇవ్వాలంటూ ఇద్దరు ఏఈఈలు నెలనెలా దందా నిర్వహించడం కార్పొరేషన్‌లో చర్చనీయాంశంగా మారింది. కానీ ఉన్నతాధికారుల పేరిట వసూళ్లు చేస్తున్న డబ్బులను నిజంగా ఖర్చు పెడుతున్నారా..? లేదా ఆ పేరిట మా వద్ద వసూళ్లు చేస్తున్నారా..? అంటూ ఇంజనీరింగ్‌లోని మిగిలిన అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కానీ వీటిని బహిర్గతం చేసేందుకు సాహసించలేని వారంతా తప్పక నెలనెల ఆ ఇద్దరి అధికారులకు చెల్లింపులు చేస్తున్నారు. ఇస్తున్నది అవినీతి సొమ్ము అవడంతో ఎవరు నోరు మెదపడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతోన్నాయి.

● ఫిర్యాదులొచ్చినా పట్టించుకోని అధికారులు

ఇంజనీరింగ్ విభాగంలో ఆర్థిక ఆధిపత్యం చెలాయిస్తున్న ఆ ఇద్దరు ఏఈఈలపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా ఉన్నతాధికారులు కనీసం పట్టించుకోకపోవడం గమనర్హం. ఉన్నత స్థాయి అధికారులందరితో ఆర్థిక సత్సంబంధాలుండటంతో వారు వీరిపై చర్యలు తీసుకునేందుకు సంకోసిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కార్పొరేషన్‌తో పాటు కొందరు జిల్లాస్థాయి అధికారులతోనూ ఆర్థిక లావాదేవీలు జరుపుతుండడంతో ఎవరు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నట్లు తెలిసింది. మొత్తం మీద కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు వసూళ్లు చేస్తున్న ఇంజనీరింగ్ అధికారుల వద్ద వీరిద్దరూ నెల మామూళ్లు డిమాండ్ చేయడం కార్పొరేషన్‌లో ఆశక్తికరంగా మారింది.

గణితంలో గమ్మత్తులపై అవగాహన

నెల్లూరు(సాంస్కృతికం), మే 19: నగరంలోని రేబాలవారివీధిలో ఉన్న జిల్లా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు గణితంలో గమ్మత్తులు కార్యక్రమం నిర్వహించారు. ప్రజాసైన్స్ పట్టణ అధ్యక్షుడు ఎం.సతీష్‌బాబు గణితంలో మెలకువలు నేర్పి వాటిపై క్విజ్ పోటీలు నిర్వహించారు. బీ.సుబ్బారావు విద్యార్థులకు ఆరోగ్యం, ప్రాథమిక చికిత్సలు పై క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్, సిబ్బంది కృష్ణయ్య, జితేంద్ర, పాల్గొన్నారు.

ఉద్యమ నిర్మాత సుందరయ్య

● సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

నెల్లూరు(వైద్యం), మే 19 : దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్యేనని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. ఆదివారం సుందరయ్య వర్ధంతి సందర్భంగా సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సీపీఎం నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మూలం మాట్లాడుతూ జిల్లాలోని అలగానిపాడులో జన్మించిన పుచ్చలపల్లి సుందరయ్య పేద ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నతి వ్యక్తి అన్నారు. దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని విస్తరింపచేశారని చెప్పారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నేతలు చంద్ర రాజగోపాల్, మదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, దయాకర్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

పుచ్చలపల్లికి ఘన నివాళి

నెల్లూరురూరల్ : దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురష్కరించుకుని ఆదివారం గ్రామాల్లో సీపీఎం శ్రేణులు ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. పుచ్చపల్లిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఉద్యమాలు, పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోగలమని స్పష్టం చేశారు. ఆయన చేసిన అనేక పోరాటాలు నేటికీ స్ఫూర్తిగా నిలిచాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలూరు తిరుపాలు, పూడిపర్తి జనార్దన్, చెంచయ్య, సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.



పుచ్చలపల్లికి నివాళులర్పిస్తున్న నాయకులు

మధుకైటభవ వధ అలంకారం

నెల్లూరు(సాంస్కృతికం), మే 19 : నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో జరుగుతున్న వసంతోత్సవాలు ఆదివారం 8వ రోజుకి చేరాయి. ఈ సందర్భంగా ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. భువనేశ్వరీ అమ్మవారికి విశేష అలంకారం, పూజలు చేశారు. రాత్రి మధుకైటభవ వధ అలంకారం, ప్రాకారోత్సవం ఘనంగా జరిగింది. తోటల్లో కైలాసనాథునికి కుంభ హారతులు, తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఈవో వేణుగోపాల్ పర్యవేక్షించారు.



వాక్యార్థం, లక్ష్యార్థం తెలిపేవే బ్రహ్మసూత్రాలు

నెల్లూరు(సాంస్కృతికం) మే 19 : ఉపనిషత్తులలోని వేదాంత విషయాలకు వాక్యార్థం, లక్ష్యార్థం తెలిపేవే బ్రహ్మసూత్రాలని ఓరుగంటి శ్రీరామలీలశర్మ తెలిపారు. ఆదివారం పొగతోటలోని ఆదిశంకర ధ్యానమందిరంలో ఆదిశంకరాచార్య సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆయన ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ధ్యాన మందిరంలో పవని అనిల్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో చక్రాల ఆనందకుమార్, తాడికొండ సీతారామశర్మ, డాక్టర్ పులిగుండ్ల లక్ష్మీనరసింహారావు, చక్రాల లక్ష్మీనారాయణ, గిరిజాలక్ష్మి, జి.ప్రభాకర్, టి.రాజేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం

నెల్లూరు(సాంస్కృతికం), మే 19 : నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేట అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజారోహణం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా విశేష పూజలు, కొడిముద్దల పంపిణీ జరిగాయి. రాత్రి స్వామివారికి శేషవాహన అలంకారం, ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఈవో జి.దర్గయ్య పర్యవేక్షించారు.

శత చండీయాగం ప్రారంభం



త్యాగరాజస్వామి మందిరంలో నిర్వహిస్తున్న శత ఛండీయాగం

నెల్లూరు(సాంస్కృతికం), మే 19 : నగరంలోని వేదాయపాలెం త్యాగరాజస్వామి ఆలయంలో ఆదివారం శత చండీయాగం వైభవంగా ప్రారంభమైంది. కేధార్‌నాథ్ నుంచి తెచ్చిన సాలిగ్రామ శివలింగం, కమలాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి ఏడాది పూర్తైన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు, మాచవోలు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో రుత్విక్కులు రుత్విక్ వరుణం, గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, అనంతరం శత చండీయాగం ప్రారంభమైంది. లఘుపూర్ణాహుతి, తీర్థ ప్రసాదాలు వితరణ జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ హరిత

నెల్లూరు(విద్య), మే 19 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడామైదానంలో ఆదివారం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అపోలో ఆసుపత్రి కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సీ.హరిత కేన్సర్ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చిన వారు ఎలాంటి మందులు వాడాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి అనంతరామారావు, కార్యదర్శి గుర్రం వెంకట సురేంద్ర బాబు, కోశాధికారి అరిగెల సాయిరాం, గౌరవాధ్యక్షుడు కిలారి తిరుపతినాయుడు, డాక్టర్ సత్యనాథ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గాంధీ పార్కులో పరిశుభ్రత

నెల్లూరు(సాంస్కృతికం), మే 19 : నగరంలోని మహాత్మాగాంధీ నగర్‌లోని పార్కును ఆదివారం మహాత్మాగాంధీ నగర్ వాకర్స్ సభ్యులు పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా చెత్తా చెదారాలు తొలగించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మాదాల వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు ఎంఎల్ఎన్.యాదవ్, కార్యదర్శి టీఎస్.బాబు, కోశాధికారి విజయకుమార్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

కావమ్మ దేవస్థానంలో అన్నదానం



అన్న ప్రసాద వితరణ చేస్తున్న వీబీఆర్

నెల్లూరు(విద్య), మే 19 : నగరంలోని చేపలమార్కెట్ సమీపంలోని బెస్తవీధిలో ఉన్న శ్రీకావమ్మ దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నారాయణ విద్యా సంస్థల జనరల్‌మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుడి నిర్వాహకులు పీ.పరంధామయ్య, పీ.వేణు, వీ.అనూష, పీ.పురుషోత్తం, పీ.కళాధర్, పీవీ.రమణయ్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాయి భక్తుల రక్తదానం



రక్తదానం చేస్తున్న సాయి భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం), మే 19 : నగరంలోని బాలాజీనగర్ పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ మందిరం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీసాయిమాత నిత్య అన్నదాన ప్రసాద నిలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీసాయి దర్బార్ యువసేవాదళ్ సభ్యుడు దివంగత కనుమూరు సాయినాథ్‌రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నేవా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సాయి భక్తుల ద్వారా 77 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమాన్ని సాయిదర్బార్ ఛైర్మన్ మధుసాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య, యువసేవాదళ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

23న సత్యనారాయణ వ్రతం

నెల్లూరు(సాంస్కృతికం), మే 19 : మహాత్మా గాంధీనగర్ కృష్ణమందిరంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఈనెల 23వ తేదీ ఉదయం 9గంటలకు శ్రీరమాసమేత సత్యనారాయణస్వామికి సత్యనారాయణ వ్రతం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు భక్తులు అందరూ తరలిరావాలని మందిరం కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో కోరారు.

సిట్ విచారణ వేగవంతం

- హింసాత్మక ఘటనలు, కేసుల సమాచారం సేకరణ
- సంబంధిత వ్యక్తుల నుంచీ వివరాల నమోదు

తిరుపతి(నేరవిభాగం)/చంద్రగిరి, మే 19 : పోలింగ్ రోజు, తర్వాత సంభవించిన హింసాత్మక సంఘటనలపై ఎన్నికల కమిషన్ నియమించిన సిట్ బృందం జిల్లాలో ఆదివారం పర్యటించి విచారణ చేపట్టింది.అదే రోజు రాత్రికే ప్రాథమిక నివేదికను సిట్‌కు నేతృత్వం వహిస్తున్న ఐజీ వినుత్ బ్రిజ్‌లాల్‌కు సమర్పించింది. ఆయా ఘటనలకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లలో పలు లోపాలను గుర్తించి, దానికి బాధ్యులైన కొందరు అధికారులపై చర్యలకు కూడా సిఫారసు చేసినట్టు తెలిసింది.

శనివారం రాత్రి తిరుపతికి చేరుకున్న సిట్ సభ్యులైన డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ ప్రభాకర్ మార్గమధ్యంలోనే మహిళా వర్శిటీ, కూచువారి పల్లెల్లో జరిగిన ఘటనలకు సంబంధించి వివిధ మార్గాల్లో వీలైన మేరకు సమాచారం సేకరించారు. ఆదివారం ఉదయం 10.45 గంటలకు ఎస్వీయూ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. పోలింగ్ మరునాడు 14వ తేదీన పద్మావతీ మహిళా వర్శిటీలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం, అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి వాహనంపై టీడీపీ వర్గీయుల దాడి చేసి ధ్వంసం చేయడం వంటి ఘటనలకు సంబంధించిన కేసుల ఎఫ్ఐఆర్‌లు పరిశీలించారు.ఆ స్టేషన్ సీఐ మురళీ మోహన్ నుంచీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఐఆర్ల ప్రతులు, సీసీ ఫుటేజీలు, ఫొటోలతో కూడిన పెన్ డ్రైవ్‌లను సీఐ మురళీమోహన్ సిట్ బృందానికి అందజేశారు. అనంతరం మహిళా వర్శిటీలో నానీపై దాడి జరిగిన ప్రాంతాన్ని, టీడీపీ వర్గీయులు ఆందోళన చేసి పోలీసు వాహనాన్ని ధ్వంసం చేసిన ప్రదేశాలను పరిశీలించారు. అక్కడినుంచి బయల్దేరి మధ్యాహ్నం 12.20 గంటలకు చంద్రగిరి మండలం కూచివారిపల్లికి చేరుకున్నారు.చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్, సీఐ రామయ్యలతో కలసి పోలింగ్ రోజు రాత్రి హింసాత్మక ఘటనలు జరిగిన ప్రాంతాలను చూశారు. టీడీపీ వర్గీయులు తగులబెట్టిన వైసీపీ సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని, కారును పరిశీలించారు. గ్రామంలోని శ్రీకృష్ణ మందిరం వద్ద గ్రామస్తులతో మాట్లాడారు. పోలింగ్ రోజు రాత్రి ఏం జరిగిందో వారిని అడిగి తెలుసుకున్నారు.


వైసీపీ దాడిలో తగిలిన గాయాన్ని చూపిస్తున్న కూచివారిపల్లివాసి


మహిళా వర్శిటీ వద్ద జరిగిన ఘటనకు సంబంధించి ఫొటోలను పరిశీలిస్తున్న డీఎస్పీ రవిమనోహరాచారి

టీడీపీ ఏజెంటును కొట్టినందునే గొడవ

పోలింగ్ రోజు వికలాంగునితో ఓటు వేయించేందుకు యత్నించిన టీడీపీ ఏజెంట్ మురళీధర్‌ను రామిరెడ్డిపల్లికి చెందిన వైసీపీ వర్గీయులు అడ్డుకుని దాడి చేసి కొట్టారని కూచివారిపల్లి గ్రామస్తులు ఆరోపించారు. వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి రావడంతో ఆ పార్టీ సర్పంచ్ రామిరెడ్డిపల్లి నుంచీ 200 మందిని రప్పించి తమపై దాడి చేయించారని ఆరోపించారు. పలువురు తమ గాయాలను కూడా చూపించారు. తాము టీడీపీ మద్దతుదారులమని, అందుకే తమపై దాడి చేశారని, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లపై కేసులు పెట్టారని, తిరుపతిలో డాక్టర్‌గా పనిచేస్తూ సోమవారం నైట్ డ్యూటీలో వున్నప్పటికీ కేసులు పెట్టించారని గ్రామ మాజీ సర్పంచ్ కవిత చెప్పారు. పెద్దఎత్తున ఘర్షణ జరిగిందని, ఆ కారణంగా సర్పంచ్ ఇల్లు, కారు ఎవరు తగులబెట్టారో, మరో కారు ఎవరు ధ్వంసం చేశారో గుర్తించలేకపోయామని గ్రామస్తులు వివరించారు. జరిగిన ఘటనలపై ఆధారాలుంటే ఇవ్వాలని డీఎస్పీ రవిమనోహరాచారి గ్రామస్తులకు సూచించారు.అనంతరం సిట్ అధికారులు పొరుగునే వున్న రామిరెడ్డిపల్లి గ్రామానికి 1.05 గంటలకు వెళ్ళి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కారు డ్రైవర్ ఈశ్వరయ్యను విచారించారు. అతడి నుంచీ ఘటనకు సంబంధించిన పూర్వాపరాలను అడిగి తెలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. తాను, మోహిత్ రెడ్డి కారులో వస్తుంటే గ్రామస్తులు అడ్డుకుని వెంటనే కారు తాళాలు, ఐడీ కార్డులు, లైసెన్సు లాక్కొన్నారని ఈశ్వరయ్య సిట్ బృందానికి వివరించారు. దాదాపు 30 నిమిషాల పాటు గ్రామంలోని పలువురిని సిట్ బృందం విచారించింది.

ఎఫ్ఐఆర్‌లలో లోపాల గుర్తింపు... కొందరిపై చర్యలకు సిఫారసు

కూచివారిపల్లిలో పోలింగ్ రోజు రాత్రి జరిగిన ఘర్షణలు, మరుసటి రోజు మహిళా విశ్వవిద్యాలయం వద్ద టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన హత్యాయత్నం, తదనంతర ఉద్రిక్తతలకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లలో పలు లోపాలను సిట్ బృందం గుర్తించినట్టు సమాచారం. అలాగే ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవడంలోనూ, హింసాత్మక ఘటనలు జరిగాక వాటిని


కూచివారిపల్లిలో దహనమైన ఇంటి పరిశీలన

నియంత్రించడం లోనూ, కేసుల నమోదులోనూ బాధ్యతా రహితంగా వ్యవహరించిన కొందరు అధికారులపై చర్యలకు కూడా సిట్ బృందం సిఫారసు చేసినట్టు తెలిసింది. సిట్ ఐజీ అనుమతితో ఈ రెండు ఘటనలపై మరింత లోతుగా విచారణ జరపాలని సిట్ అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. సుమారు 70-80మందిని విచారించాల్సి వుందని, ఘటనల పూర్వాపరాలను బట్టి పోలీసు అధికారులు ఏయే సందర్భాలలో ఏ స్థాయిలో విఫలమయ్యారన్నది అంచనా వేయడానికి వీలవుతుందని వారు భావిస్తున్నట్టు తెలిసింది. సిట్ ఐజీ అనుమతిస్తే ఆ మేరకు విచారణ లోతుగా కొనసాగనుంది.

పోలీసు అధికారుల్లో లోపించిన పారదర్శకత

పోలింగ్ రోజు, తర్వాత జరిగిన హింసాత్మక ఘటనల్లో పోలీసు అధికారులు పారదర్శకంగా వ్యవహరించలేదు. ముఖ్యంగా కూచివారిపల్లి, రామిరెడ్డిపల్లి గ్రామాల్లో పోలింగ్ రోజు వాస్తవంగా ఏం జరిగింది? ఆ రోజు రాత్రి కూచివారిపల్లిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడానికి కారకులు ఎవరు? అన్న విషయాలు పోలీసు అధికారులు ఇంతవరకూ వెల్లడించలేదు. అలాగే పోలింగ్ మరుసటి రోజు మహిళా వర్శిటీ వద్ద నానీపై హత్యాయత్నం జరిగిన సందర్భంలో ఆయన గన్‌మ్యాన్ జరిపిన కాల్పుల్లో ఇద్దరు దాడికి యత్నించిన వైసీపీ వ్యక్తులు గాయపడిన విషయం కూడా పోలీసు అధికారులు వెల్లడించలేదు. హత్యాయత్నానికి పాల్పడిన వైసీపీ వ్యక్తుల్లో ఇద్దరు గన్‌మ్యాన్ కాల్పుల్లో గాయపడ్డారని గానీ, వారి వివరాలు గానీ వెల్లడించలేదు. అలాగే నానీపై హత్యాయత్నం తర్వాత టీడీపీ వర్గీయులు వర్శిటీ ఎదుట ఆందోళనకు దిగినపుడు అలిపిరి సీఐ రామచంద్రారెడ్డిపై దాడి జరిగినట్టు తెలిపే వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. దానిపై కూడా పోలీసు అధికారులు ఇంతవరకూ స్పందించలేదు. కనీసం దాడి జరిగిందా లేదా అన్నది కూడా స్పష్టత ఇవ్వడం లేదు. చిన్నపాటి కేసులపై కూడా ప్రెస్‌మీట్లు పెట్టి మరీ వివరాలు వెల్లడించే అధికారులు ఇంత తీవ్ర ఘటనలు జరిగినపుడు మౌనం వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. ఎవరి ఆదేశాలతో ఈ విషయాలను గోప్యంగా వుంచారు? ఎందుకోసం అలా చేశారు? అన్న ప్రశ్నలకు అధికారుల నుంచీ సమాధానాలు లేవు. ఈ అంశాలపై సిట్ అధికారులు ఎంత వరకూ దృష్టి సారించారో, ఏ మేరకు వివరాలు సేకరించి నివేదికలో పొందుపరిచారో తేలాల్సి వుంది.

పక్కా ప్రణాళికతోనే హత్యాయత్నం!


పోలీసు అధికారులకు ముందస్తు సమాచారం

ఎమ్మెల్యే చెవిరెడ్డి, కుటుంబీకుల కాల్ డేటా పరిశీలించండి!

సిట్ అధికారులకు పులివర్తి నానీ ఫిర్యాదు

పక్కా ప్రణాళికతోనే, ఉద్దేశపూర్వకంగా తనపై హత్యాయత్నం జరిగిందని తిరుపతి జిల్లా చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ ఈసీ నియమించిన సిట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి తిరుపతిలోని యూనివర్శిటీ పోలీస్ స్టేషన్ వద్ద సిట్ అధికారులను నానీ కలిశారు. హత్యాయత్నం ఘటనతో పాటు కూచివారిపల్లిలో జరిగిన ఘర్షణల గురించి కూడా నానీని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నానీ మాట్లాడుతూ తనను అంతమొందించేందుకు పక్కా ప్రణాళికతోనే దాడి చేయించారన్నారు.దీనికి సంబంధించి కేసులో నిందితులుగా నమోదైన భానుకుమార్‌రెడ్డి, గణపతి రెడ్డి కేవలం పాత్రధారులేనని, తెర వెనుక వున్న అసలైన దోషులను గుర్తించాలని కోరారు. ఈ ఘటనకు సంబంధించి వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఆయన సోదరుడు రఘునాధరెడ్డి, వైసీపీ నాయకులు భానుకుమార్‌రెడ్డి, గణపతిరెడ్డిల నడుమ జరిగిన ఫోన్ సంభాషణలను బయట పెట్టాలని, దానికోసం వారి కాల్ డేటాను పరిశీలించాలని కోరారు. వారిని అరెస్టు చేసి విచారణ జరపాలని కోరారు. లేదంటే కేసు విచారణను ప్రభావితం చేసే అవకాశముందన్నారు. అలాగే తనపై హత్యాయత్నానికి సంబంధించి పోలీసు అధికారులకు ముందుగానే సమాచారం వుందన్న అనుమానం వ్యక్తం చేశారు. అందుకే తనపై దాడి జరిగిన తర్వాత 40 నిమిషాల పాటు పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకోలేదని సిట్ అధికారులకు చెప్పారు. దాడి గురించి వారికి సమాచారం ఇచ్చినా కూడా స్పందించలేదన్నారు. దీనిపై కూడా లోతుగా విచారించి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా పోలింగ్ రోజు వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులే పలుచోట్ల టీడీపీ వర్గీయులను రెచ్చగొట్టేలా వ్యవహరించారని ఆరోపించారు. తన స్వగ్రామమైన పాకాల మండలం పులివర్తివారిపల్లికి వైసీపీ అభ్యర్థి 17 వాహనాల్లో అనుచరులను తీసుకెళ్ళి గ్రామస్తులను రెచ్చగొట్టారని చెప్పారు. అక్కడి నుంచీ కాశిపెంట్ల, కూచివారిపల్లెలకు వెళ్ళి అక్కడా ఘర్షణలకు, ఉద్రిక్తతలకు కారణమయ్యారని వివరించారు. పులివర్తివారిపల్లి, కాశిపెంట్ల, కూచివారిపల్లి గ్రామాల్లో వారి తీరును విచారించాలని కోరారు. కూచివారిపల్లిలో ఒకే ఘటనపై వైసీపీ అభ్యర్థి మోహిత్ తన కారు డ్రైవరుతోనూ, తన పీఆర్వోతోనూ వేర్వేరుగా ఫిర్యాదులు చేయించి రెండు కేసులు నమోదు చేయించారని సిట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసుల్లో సంబంధం లేని వారిని నిందితులుగా చేరుస్తున్నారని వివరించారు. కేసుతో సంబంధం లేని వారి పేర్లు తొలగించాలని కోరారు. ఈ మేరకు లిఖితపూర్వకంగా పులివర్తి నానీ సిట్ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు.


సిట్ డీఎస్పీ రవిమనోహరాచారికి తనపై దాడి జరిగిన తీరును వివరిస్తున్న పులివర్తి నాని


అంకురార్పణ పూజలు - ప్రత్యేక అలంకరణలో ఉత్సవర్లు

కోనకు చేరిన పెంచల స్వామి

- గిరిజనవాడల్లో అంబరాన్నంటిన సంబరాలు
- నృసింహుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

డక్కిలి, మే 19 : వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు మండలంలో వున్న గోనుపల్లి, గోనుపల్లి గిరిజన వాడలు ఆదివారం గోవింద నామస్మరణతో మార్మోగాయి. తప్పెట్లు, తాళాలు, గిరిజన నృత్యాలు, బాజాభజంత్రీల నడుమ ఉభయ దేవేరులతో కలిసి పెంచల నృసింహ స్వామి బ్రహ్మోత్సవాల కోసం పెంచలకోనకు బయల్దేరారు. గోనుపల్లిలోని పెంచల ఆలయం నుంచి పల్లకిలో చెంచులక్ష్మీ దేవి ఇంటికి చేరుకొన్నారు. కొత్తల్లుడి రాకతో గోనుపల్లి గిరిజన వాడ జనం తమ ఆచారం ప్రకారం పుట్టతేనె, ఇంజేటి గడ్డలు, నారె మొలతాడును సారెగా ఇచ్చారు. గిరిజన వాడలోని ప్రతి ఇంటి వద్ద నేరేడు ఆకులతో పచ్చటి పందిళ్ళు, ఇండ్ల ముంగిట రంగవల్లులు వేసి వధూవరులకు ఘనంగా స్వాగతం పలికారు. అత్తారింటికి చేరిన వరుడు నరసింహ స్వామిని చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకొన్నారు.ప్రత్యేక పూజల అనంతరం ముత్తైదువులు వధూవరులను పొలిమేర వరకు సాగనంపారు. పూలతో అలంకరించిన పల్లకీలో దేవేరులతో కలిసి కొలువు దీరిన స్వామివారు గ్రామ శివారులోని గొల్లబోయి ఆలయానికి చేరుకొని తొలిదర్శనం గొల్లబోయికి ఇచ్చారు. అనంతరం బోయీలు పల్లకీ మోసుకొంటూ 6 కిలో మీటర్లు కాలినడకన పెంచలకోనకు పయనమయ్యారు.సహజసిద్ధమైన ప్రకృతి అందాల నడుమ వందలాది భక్తుల మధ్య స్వామివారు కోనకు చేరుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సాగర్ బాబు, ప్రధాన అర్చకులు రామయ్య స్వామి, పెంచలస్వామి శశి స్వామి, అర్చకులు, భక్తులు స్వాగతం పలికారు. ఐదురోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుపుకొని తిరిగి స్వామి వారు ఈ నెల 25వ తేదీన గోనుపల్లికి చేరుకొంటారు. ఈ ఐదు రోజుల పాటు గోనుపల్లి వాసులు మాంసాహారాలకు దూరంగా వుంటారు. పెంచలకోనలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక స్నపన తిరుమంజనం, విశేష పూజలు నిర్వహించారు.


గోనుపల్లి నుంచి కోనకు పల్లకీపై వస్తున్న శ్రీవారు

- కోనలో ఉత్సవాలకు అంకురార్పణ

పెంచలకోనలోని శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అంకురార్పణతో మొదలయ్యాయి. ఆలయంలోని అలంకార మండపంలో అర్చకులు, వేదపండితులు ప్రత్యేక యాగశాల ఏర్పాటుచేసి హోమాలు జరిపారు. అర్చకులు పుట్ట మన్ను తీసుకువచ్చి అందులో నవధాన్యాలు కలిపి కలశస్థాపన చేసి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. అనంతరం కోన వీధుల్లో సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు.


శ్రీవారికి ప్రసాదంగా అటవీ ఉత్పత్తులు తీసుకొస్తున్న గిరిజన మహిళలు


మహిళా వర్శిటీలో స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధనరాజు

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్

- ఎస్పీ హర్షవర్ధనరాజు హామీ

తిరుపతి(నేరవిభాగం/కలెక్టరేట్), మే 19 : కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి గట్టి చర్యలు తీసుకుంటానని ఎస్పీ హర్షవర్ధనరాజు చెప్పారు.జిల్లా ఎస్పీగా ఆదివారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ తిరుపతికి రావడం సంతోషంగా వుందన్నారు.అయితే ప్రస్తుత పరిణామాల నడుమ బాధ్యతలు తీసుకోవడం సవాలుతో కూడుకున్నది అయినప్పటికీ ప్రణాళికాబద్ధంగా పని చేసి అధిగమిస్తానని చెప్పారు. శాంతి భద్రతలు కాపాడే విషయంలో రాజీ లేకుండా పనిచేస్తానని చెప్పారు.అంతకు ముందు ఎస్పీకి ట్రైనీ ఎస్పీ దేవరాజ్‌మనీష్ పాటిల్, ఏఎస్పీలు కులశేఖర్, వెంకట్రావు, రాజేంద్ర, విమల కుమారి, శ్రీనివాసులు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం కలెక్టర్‌తో కలిసి మహిళా వర్శిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేసి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూముల వద్ద భద్రతను పరిశీలించారు.మీడియా సెంటర్ ఏర్పాటుపై అధికారులకు సూచనలు చేశారు. డీఆర్వో పెంచలకిషోర్, ఏఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.


తిరుమలలో కొనసాగిన రద్దీ

తిరుమల, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ పాపవినాశనం సర్కిల్ వరకు వ్యాపించింది. కల్యాణవేదిక వద్ద నుంచి భక్తులను దఫాల వారీగా ముందుకు పంపుతున్నారు. వీరికి 24 గంటల దర్శన సమయం పడుతోంది. గదులకు డిమాండ్ కొనసాగుతూనే ఉంది. గదిని పొందేందుకు రెండు నుంచి మూడు గంటల సమయం పడుతోంది.రద్దీ నేపథ్యంలో పాపవినాశనం, శ్రీవారి పాదాల మార్గాల్లో రెండురోజులుగా నిలిపివేసిన వాహనాలను ఆదివారం తిరిగి అనుమతించారు.



ఆఫ్రికాలో మైనింగ్ అవసరాల కోసమే భారీ వాహనాలు పంపుతున్నాం


మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి



తిరుపతి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆఫ్రికాలో తాము నిర్వహిస్తున్న మైనింగ్ కాంట్రాక్ట్ అవసరాల కోసమే ఇండియా నుంచి పొక్లైయిన్లు, టిప్పర్లు ముంబై పోర్టునుంచి పంపుతున్నామని, టీడీపీ నేతలు ఆరోపిస్తున్నట్టు వాటిలో నగదు, బంగారు పంపించడం లేదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి చెప్పారు. ఆదివారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు.తాము నిర్వహిస్తున్న పీఎల్ఆర్, జస్విన్ సంస్థల తరఫున ఆఫ్రికాలో ఫెరో మ్యాంగనీస్, ఫెరో సిలికా మైనింగ్ కాంట్రాక్ట్ పనులు చేపట్టామన్నారు. దశలవారీగా వంద భారీ వాహనాలను, యంత్రాలను పంపుతున్నామన్నారు.దీనికే దేశాలు వదిలి పారిపోతున్నామని చెప్పడం హాస్యాస్పదమన్నారు.పోలింగ్ శాతం పెరగడానికి కారణం మహిళలేనని, ఐప్యాక్ సర్వేలో మహిళలు తమకే ఓట్లు వేసినట్టు తేలిందన్నారు.ఈ- ఆఫీస్ అప్డేట్ చేయడం ఏడాదికోసారి జరుగుతుందని, దాన్ని కూడా అడ్డుకుంటున్నారని, ఈ రెండు వారాలు అడ్డుకుంటే తమకు నష్టమేం లేదన్నారు. తొలినుంచి తమ నాయకుడు వైనాట్ 175 అని చెబుతున్నప్పటికీ, తాను మాత్రం 150 పైన వస్తాయనే తొలి నుంచీ చెబుతున్నానని చెప్పుకొచ్చారు.

పిడుగుపాటుకు ఒకరి మృతి

పుత్తూరు, మే 19: పుత్తూరు మండలం కృష్ణసముద్రం గ్రామానికి చెందిన అన్నుకుమార్ (45) ఆదివారం మధ్యాహ్నం పిడుగు పడి మరణించారు. గ్రామానికి సమీపంలోని రామసముద్రం చెరువు వద్ద మేకలు మేపు కుంటుండగా పిడుగు పడింది. వెంటనే నగరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు.


మృతుడు అన్నుకుమార్

మాంసం ధరలకు రెక్కలు

కేజీ రూ. 300 దాటిన చికెన్ ● కేజీ రూ. 900కు చేరిన మటన్



గూడూరు అర్బన్, మే 19: పొయ్యిమీదకు చేరక ముందే మాంసం ధరలు మండిపోతున్నాయి. చికెన్ ధరలు అమాంతం పెరిగి కేజీ రూ. 300 దాటింది. మటన్ కూడా కేజీ రూ. 900కు చేరుకుంది. గూడూరులో ఆదివారం బాయిలర్ చికెన్ ధర కేజీ రూ. 300లకు విక్రయాలు జరిగాయి. స్కిన్‌లెస్ కేజీ రూ. 330, బోన్‌లెస్ కేజీ రూ. 350 వంతున అమ్ముడయ్యాయి. ఈ ఏడాదిలో ఇదే గరిష్టమని వ్యాపారులు అంటున్నారు. అలాగే పొట్టేళ్లు, మేకపోతు మాంసం కేజీ ధర రూ. 900లకు చేరుకుంది. మాంసం ధరలు పెరిగినా విక్రయాలు మాత్రం తగ్గలేదు. ఆదివారం మాంసం అంగళ్లు కస్టమర్లతో కళకళలాడాయి.

అధైర్యపడకండి..అండగా ఉంటా : పాశం



కార్యకర్తలతో టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్

గూడూరు, మే 19: వైసీపీ నాయకుల దాడులకు, దౌర్జన్యాలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, అందరికీ అండగా ఉంటానని టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువత ఆయనను కలిశారు. ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు అకారణంగా టీడీపీ నాయకులపై దాడులకు దిగుతున్నారన్నారు. వీరికి పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో తాను గెలవడం ఖాయమని, కూటమి అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో శ్రావణి, మురళి, శ్రీనివాసులు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో గెలుపు కూటమిదే : బీజేపీ



మాట్లాడుతున్న ఎస్ఎస్ఆర్ నాయుడు

వెంకటగిరిటౌన్, మే 19: ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిదే విజయం అని బీజేపీ వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడుతూ ఐదేళ్ళుగా ఆల్తూరుపాడు రిజర్వాయర్, స్వర్ణముఖి కెనాల్ కాలువ, నియోజకవర్గం అభివృద్ధి విషయంలో వైసీపీ విఫలమైందన్నారు. సీఎం జగన్ ఆల్తూరుపాడు రిజర్వాయర్ కోసం రీటెండర్ పిలిస్తే నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పనులు ప్రారంభించలేకపోయారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణయ్య, వెంకటరమణ, రమణయ్య పాల్గొన్నారు.

క్యాండిల్స్‌తో హెచ్ఐవీ బాధితులకు సంఘీభావం



నాయుడుపేట, మే 19 : అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా ఆదివారం నవజీవన్ స్వచ్ఛంద సంస్థ క్యాండిళ్లను ప్రదర్శించారు. నవజీవన్ ప్రాజెక్టు మేనేజర్ కె. బాలాజీరాజు మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితుల మృతుల ఆత్మకు శాంతి చేకూర్చాలని క్యాండిల్స్‌తో సంఘీభావం తెలుపుతున్నట్లు తెలిపారు. అలాగే హెచ్ఐవీ బాధితులకు, వారి కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నవజీవన్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది కవిత, శ్రావణి, బాలాజీ, అనురాధ, నందిని, మంజుల, ఐశ్వర్య, ప్రసన్న, మీరమ్మ, భారతి తదితరులు ఉన్నారు.

శ్రీకాళహస్తి రోడ్డు గుంతలమయం



తడ, మే 19 : చుట్టూ పరిశ్రమలు... వాటి కోసం వచ్చే వేలాది వాహనాలు... ఆ రోడ్డు మీదే నడవాలి... కాని ఆ రోడ్డు సంవత్సరాల తరబడి గోతులమయంగా ఉంది. అదే తడ-శ్రీకాళహస్తి రోడ్డు. తడ జాతీయ రహదారి నుంచి శ్రీకాళహస్తి-తిరుపతికి వెళ్లేందుకు ఉన్న ఒకే ఒక ఆర్అండ్‌బీ రహదారి అది. చుట్టూ వందలాది పరిశ్రమలకు చెందిన బస్సులు... పరిశ్రమలకు వచ్చే లారీలు, తిరుపతి, శ్రీకాళహస్తిలకు వెళ్లే బస్సులు ఇలా వందలాది వాహనాలు ఈ రహదారిపైనే ప్రయాణిస్తుంటాయి. మూడేళ్లుగా ఈ రహదారి గోతులమయమై ఉంది. ప్రభుత్వం పట్టించుకోవడం మానేసింది. తద్వారా ప్రమాదాలు జరుగుతున్నా ఆ రహదారిని బాగుచేయాలన్న ఆలోచన అటు అధికారులకు కాని, ఇటు ప్రభుత్వానికి కాని ఉన్నట్లు కనబడటం లేదు. ఈ రహదారిని బాగుచేయండి మహాప్రభో అంటూ స్థానికులు అప్పుడప్పుడు వాపోతున్నారు.

మాన్యాలున్నా.. దీపధూప నైవేద్యాలు కరువే..!



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం

నాయుడుపేట టౌన్, మే19: పట్టణంలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి మాన్యాలున్నా దీప, ధూప నైవేద్యాలకు నోచుకోవడంలేదు. నాయుడుపేట బ్రాహ్మణవీధిలో వెలసిన ఈ ఆలయానికి 37 ఎకరాల మాన్యం భూములున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం పుంజులూరుపాడు, తడ మండలం మాంబట్టు, నాయుడుపేట మండలం ఉద్దిగుంటకండ్రిగ, విన్నమాల, చిల్లకూరు మండలం ఏరూరు, పెళ్లకూరు మండలం చిల్లకూరు ప్రాంతాల్లో మాన్యం భూములున్నాయి. ఈ భూములకు దేవదాయశాఖ అధికారులు వేలంపాటలు నిర్వహిస్తున్నారు. అయినా అభివృద్ధికి ఆమడదూరంలో ఉంటుంది. చిన్నపాటి వర్షం కురిసినా ఆలయ ప్రాంగణం చిత్తడిగా మారుతుంది. పూజారికి ప్రతినెలా జీతాలిచ్చే పరిస్థితి లేదు. గతేడాది తుఫాన్‌కు ఆలయ ధ్వజస్తంభం విరిగిపడిపోయింది. ఇప్పటికీ కొత్త ధ్వజస్తంభం ఏర్పాటుచేసి కుంభాభిషేకం నిర్వహించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి ఆలయ భూముల నుంచి కౌలు వసూళ్లు చేసి ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కలవకొండలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చిల్లకూరు, మే19: మండలంలోని కలవకొండలో ఆదివారం అంకురార్పణ కార్యక్రమంతో లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గంగ కాలువ ఇలా... నీరు పారేదెలా ?

ఏళ్లు గడిచినా మరమ్మతులకు నోచుకోని కాలువలు



ఓజిలి వద్ద గంగ బ్రాంచ్ కాలువలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

ఓజిలి, మే 19 : రైతులకు సాగు నీరు, చెన్నైకి తాగునీరు అందించే ఉద్దేశంతో రూపుదిద్దుకున్న తెలుగు గంగ కాలువ నేడు చెన్నైకి తాగునీరు ఎలా ఉన్నా నెల్లూరు, తిరుపతి జిల్లాల రైతాంగానికి సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. సోమశిల వద్ద కండలేరు-పూండి(కేపీ కెనాల్) కాలువ పేరుతో ప్రధాన కాలువ ఏర్పాటుచేసి తమిళనాడు రాష్ట్రం ఊత్తుకోటకు సమీపంలోని పూండి రిజర్వాయరు వరకు గల 406 కిలోమీటర్ల పొడవున ఈ కాలువ ఏర్పాటైంది. ఈక్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కేపీ కెనాల్ నుంచి ఏడు బ్రాంచి కాలువల ద్వారా జిల్లా రైతులకు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రూపుదిద్దుకున్న బ్రాంచి కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించే క్రమంలో ఆయా పరిధిలోని చెరువులకు సాగు నీరు నింపుతున్నారు. ఈక్రమంలోనే ఓజిలి మండలంలో 5వ బ్రాంచి కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందుతోంది.

ఐదేళ్లుగా అటకెక్కిన మరమ్మతులు

తెలుగు గంగ బ్రాంచి కాలువల ద్వారా సాగునీరు అందుతున్న క్రమంలో ఆయా బ్రాంచి కాలువలు ఏటా మరమ్మతులకు గురై రైతులకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. గతంలో గంగ అధికారులు బ్రాంచి కాలువలకు తరచుగా మరమ్మతులు చేపట్టడంతోపాటు జంగిల్ క్లియరెన్సు వంటి పనులతో రైతులకు అండగా నిలిచే పరిస్థితి ఉండేది. గత ఐదేళ్ల నుంచి బ్రాంచి కాలువలపై దృష్టి సారించని నేపథ్యంలో కాలువలు నిర్వీర్యమైపోయాయి. ఎక్కడ చూసినా బ్రాంచి కాలువలతో పాటు 5వ బ్రాంచి కాలువ కూడా ఇలానే తయారైంది. కాలువలు మొత్తం పిచ్చిచెట్లు, తుప్పలు, ముండ్ల పొదలతో సాగు నీరు పారే పరిస్థితి కనిపించడంలేదు.

రైతులకు తప్పని తిప్పలు...

తెలుగు గంగ ద్వారా రైతులకు సాగు నీరు అందించే క్రమంలో కాలువలలో నీటిని విడుదల చేసినా కాలువలలో పేరుకుపోయిన తుప్పలు, ముండ్లపొదలు, గడ్డి పొదల కారణంగా రైతులకు సాగు నీరు అందటంలేదు. దీంతో గత ఐదేళ్లుగా రైతులకు ఏటా సాగునీటి తిప్పలు తప్పడంలేదు. నీరు పుష్కలంగా ఉండీ చివరికంటా రైతులకు ఆనీరు అందకపోవడంపై రైతులు ఆవేదన చెందుతున్నారు. బ్రాంచి కాలువలలో పేరుకుపోయిన ఈ తుప్పలు, ముండ్ల పొదలు, గడ్డి పొదలను తొలగించి రైతులకు సక్రమంగా సాగునీరు అందేలా చూడాలని మండల రైతులు కోరుతున్నారు.

ఊపందుకున్న ఖరీఫ్ పనులు

● పెళ్లకూరు మండలంలో 2600 ఎకరాల్లో వరి సాగు
● కూలీలకు పెరిగిన డిమాండ్



చిల్లకూరులో నాట్లు వేస్తున్న కూలీలు

పెళ్లకూరు, మే 19 : మండలంలోని అనేక గ్రామాల్లో వ్యవసాయ బోర్ల కింద వరి నాట్లు పనులు ఊపందుకున్నాయి. స్వర్ణముఖీనది తీర ప్రాంతాలైన పుల్లూరు, కలవకూరు, ముమ్మారెడ్డిగుంట, చింతపూడి, నెలబల్లి, పాలచ్చూరు, పెళ్లకూరు, కొత్తూరు, రావులపాడు, చిల్లకూరు, జీలపాటూరు తదితర గ్రామాల రైతులు ఖరీఫ్ పంటల సాగులో బిజీగా ఉన్నారు. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండంతో రైతులంతా ఒకేసారి నాట్లు ప్రారభించడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. మండల వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 2600 ఎకరాల్లో వరిసాగు చేపడతారని వ్యవసాయశాఖ అంచనా. మండలంలో ఎక్కువ మంది రైతులు ఎంటీయూ 1010 రకం ధాన్యాన్ని సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఎకరంలో నాట్లు వేసేందుకు రూ. 3300 నుంచి రూ. 3500 వరకు కూలీలు డిమాండ్ చేస్తున్నారు. గతేడాది రూ. 3000 నుంచి రూ. 3200 వరకు తీసుకునే వారు. ఈ ఏడాది అదనంగా రూ.300 నుంచి రూ.500 వరకు కూలీ పెంచేశారు. దీంతో పెట్టుబడి భారీగా పెరుగుతోంది. ఎకరం భూమిలో పంట చేతికి అందేటప్పటికి రూ. 30వేల నుంచి రూ. 35వేలు రైతులకు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. పెరిగిన పెట్టుబడులకు వాతావరణం అనుకూలిస్తేనే పంట చేతికి అందుతుంది. కోతల సమయానికి తుఫాన్ల ప్రభావంతో అకాల వర్షాలు పడితే భారీగా నష్టాలు తప్పవు.

మలుపులు... ప్రమాద పిలుపులు



నాయుడుపేట రోడ్డు వద్ద, మోడల్ స్కూల్ వద్ద, రైల్వే స్టేషన్ వద్ద ప్రమాదకర మలుపులు

వెంకటగిరి టౌన్, మే 19: రహదారుల వద్ద పలు మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ప్రధాన రహదారుల్లోని మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల్లో ఏమాత్రం చలనం రావడం లేదు. మలుపుల వద్ద సూచిక బోర్డుల ఏర్పాటులో ఆర్అండ్‌బీ అధికారులు విఫలమయ్యారు. టోల్‌గేట్‌లు కట్టించుకునే జాతీయ రహదారుల్లో కూడా సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.అదేమార్గంలో పాఠశాల ఉందని సూచించే బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.వెంకటగిరి-నాయుడుపేట మార్గంలో నాలుగు మలుపులున్నాయి. ఈ మలుపుల్లో ఎక్కడ కూడా సూచిక బోర్డులు ఏర్పాటు లేదు. అంతే కాకుండా వెంకటగిరి నుంచి రాపూరు వెళ్లే మార్గంలో జాతీయ రహదారి కాంపాళెం క్రాస్ వద్ద మలుపు ఉంది. ఇక్కడ కూడా సూచిక బోర్డు లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్య



గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేటలలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

గూడూరు, మే 19: ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం నాయకుడు శివకుమార్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని మార్కెట్ సెంటర్, శివాలయం సెంటర్ తదితర ప్రాంతాలలో సీపీఎం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం, వ్యవసాయ కార్మికుల కోసం సుందరయ్య అలుపెరుగని పోరాటాలు సాగించారన్నారు. వ్యవసాయ కార్మికసంఘాన్ని ఏర్పాటు చేసి ఎంతో మంది నిరుపేదల సమస్యలను పరిష్కరించారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో శంకరయ్య, బీవీరమణయ్య, సురేష్, మధు, మణి, బాబు, వెంట్రామిరెడ్డి, ప్రసాద్, చంద్రయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్ : పుచ్చలపల్లి సుందరయ్య ప్రజలకు అందించినసేవలు చిరస్మరణీయమని సీఐటీయూ నాయకులు శివకవి ముకుంద అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు మహేష్‌బాబు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పద్మమ్మ, మణెమ్మ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట : సూళ్లూరుపేటలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రం ఏర్పాటు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మయ్య, పద్మనాభయ్య, సాంబశివయ్య, రమణయ్య, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిటౌన్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయం పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా నేత ఆర్.లక్ష్మి మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య నిరాడంబరమైన జీవితాన్ని గడిపి ఎంతో మందికి ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో భక్తుల సందడి



చెంగాళమ్మ ఆలయ క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు, మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఎన్నికల నేపథ్యంలో మూడు వారాలనుంచి భక్తుల సందడి కనిపించలేదు. ఈ వారం ఉదయం నుంచి ఆలయ ప్రాంగణమంతా ఎక్కడ చూసినా భక్తుల సందడే కనిపించింది. ఉదయం నుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. - సూళ్లూరుపేట

పేదలకు కూరగాయల పంపిణీ



గూడూరు అర్బన్, మే 19: స్థానిక సీవీసీ పార్కులో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పేదలకు, దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ పేదలకు, దివ్యాంగులకు చేయూతనందించేలా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామ్మోహన్, చెంచునారాయణ, జగదీష్, గోపి, విజయ్‌బాబు, సుధీర్, పవన్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు పీడీకి సన్మానం



గూడూరు, మే 19: పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఉద్యోగవిరమణ చేసిన చిల్లకూరు గురుకుల పాఠశాలలోని పీడీ జానకిరామయ్యకు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జానకిరామయ్య ఎంతో అంకితభావంతో విధులు నిర్వహించారన్నారు. ఆయన స్ఫూర్తితోనే ఈ రోజు తాము సమాజంలో వివిధ రంగాలలో ఉన్నత స్థానాలలో రాణిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు కంటేపల్లి వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌కుమార్, సురేష్, జిలానిబాషా, ధర్మయ్య, పరుశురామ్, డాక్టర్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు బలరామ్‌రెడ్డి, ఇబ్రహీమ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు



కోట, మే 19 : కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ పాలకమండలి వారు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఏడు పెట్రోల్ బంకులకు నోటీసులు

కోట, మే 19 : కోట మండలంలోని 7 పెట్రోల్ బంకులకు ఆదివారం హెచ్చరిక నోటీసులు జారీచేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. మాచర్లలో జరిగిన ఘటన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ పలు కీలక ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో పెట్రోల్ బంకుల యజమానులను అప్రమత్తం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయా పెట్రోల్ బంకుల నుంచి లూజుగా క్యాన్‌లు, సీసాలలో పెట్రోలు పట్టి ఇవ్వకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

దాడి చేశారని ఫిర్యాదు

చిల్లకూరు, మే 19: మండలంలోని గుత్తావారిపాళెంలో ఆదివారం అదే గ్రామానికి చెందిన నారాయణతోపాటు పలువురు కమ్మవారిపాళెం గ్రామానికి చెందిన సుధాకర్, నెల్లూరుకు చెందిన అనూప్‌రెడ్డిలపై దాడి చేశారని ఆదివారం బాధితుడు సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పొలం విషయమై చర్చించుకుంటుండగా వివాదం ఏర్పడడంతో దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

రామమందిరానికి వెండి కానుక



నాయుడుపేట, మే 19 : పట్టణంలోని బజారువీధిలో వెలసిన రామమందిరానికి ఓ దాత వెండి కానుకను అందజేశారు. ఆదివారం పట్టణానికి చెందిన దాత హరికృష్ణ, రమ్య, మహదేవరెడ్డిల సహకారంతో 20వేల రూపాయల విలువచేసే వెండి కానుకను దేవదాయశాఖ ఈవో శశ్యాంక్‌కు అందజేశారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు.

నేడు జలశక్తి కమిటీ రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 19: జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇద్దరు సభ్యుల బృందం పద్మావతి యూనివర్సిటీకి నేడు రానుంది. జాతీయ నీటి పురస్కారం కోసం గత డిసెంబరులో యూనివర్సిటీ దరఖాస్తు చేసుకుంది. దీంతో, యూనివర్సిటీలో నీటి పొదుపు, నిల్వ చేసే విధానం, వాటర్ ట్యాంకుల పరిశుభ్రత, గ్రీన్ హౌస్, ఔషధ మొక్కల పెంపకం, హాస్టళ్లలోని వ్యర్థాలతో ఎరువుల తయారీ, ఇంకుడు గుంతల ఏర్పాటు వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. ఈ అవార్డుకు దేశంలోని 200 యూనివర్సిటీలు దరఖాస్తు చేసుకున్నాయి. ఇందులో 20 యూనివర్సిటీలను ఎంపిక చేశారు. మన రాష్ట్రంలో రెండు యూనివర్సిటీలు ఎంపికయ్యాయి. వీటిలో పద్మావతి యూనివర్సిటీ ఒకటి. ఈ క్రమంలో జలశక్తి కమిటీ పద్మావతి వర్సిటీని సందర్శించనుంది. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ భారతితోనూ సమావేశం కానున్నారు. అన్నీ అనుకూలిస్తే, జూన్‌లో యూనివర్సిటీ జాతీయ నీటి పురస్కారానికి ఎంపిక కానుంది.

నేడు ఇంటర్ తత్కాల్‌ఫీజు చెల్లింపునకు చివరిగడువు

తిరుపతి(విద్య), మే 19: ఈనెల 24నుంచి జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల తత్కాల్‌ఫీజు చెల్లింపునకు సోమవారంతో గడువుతేదీ ముగుస్తుందని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సబ్జెక్టులకు సంబంధించిన ఫీజుతోపాటు అదనంగా రూ.3వేలు ఇంటర్‌బోర్డుకు చెల్లించాలని తెలిపారు. వివరాలకోసం 9441433025 నెంబరుని సంప్రదించాలని కోరారు.

జ్ఞానభూమిలో ఇంటర్ హాల్‌టికెట్లు: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లు జ్ఞానభూమిలాగిన్‌లో అందుబాటులో ఉన్నాయని ఆర్ఐవో పేర్కొన్నారు. విద్యార్థులు నేరుగా వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, హాల్‌టికెట్లపై కళాశాల ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని తెలిపారు.